





మద్దులగూడెం చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు

చిన్నయ్యగట్టు చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దులగూడెం చిన్నయ్యగట్టు చెరువులో మట్టిని అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. కొంతకాలంగా చెరువులో మట్టి తవ్వకుని కొందరు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అర్ధరాత్రి వేళ చెరువు తవ్వకాలు జోరుగా సాగిస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. పాలకులు, అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తవ్వకాలతో చెరువు గోతులమయం కావడం ప్రమాదకరమని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ తవ్వకాలను ఆపకుంటే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.



పరీక్ష కేంద్రానికి ఉరుకులు పరుగులతో చేరుకుంటున్న అభ్యర్థులు, పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థుల హాల్‌టిక్కెట్లు, గుర్తింపు పత్రాలు తనిఖీ చేస్తున్న సిబ్బంది

జేఈఈ మెయిన్

తొలిరోజు 26మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్ రెండో విడత బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఏలూరు శివారు వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ స్కూల్‌లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. అభ్యర్థులను సిబ్బంది తనిఖీ చేసి పరీక్ష కేంద్రం లోనికి అనుమతించారు. తొలిరోజు ఉదయం షిఫ్ట్‌కు 167మంది విద్యార్థులను కేటాయించగా 157 మంది, మధ్యాహ్నం షిఫ్ట్ పరీక్షకు 143మందికి 127మంది హాజరయ్యారు. ఆన్‌లైన్ పద్ధతిలో జరిగిన పరీక్షకు ఎక్కడా సాంకేతిక సమస్యలు తలెత్తలేదని, పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని నిర్వాహకులు తెలిపారు.

అధికారితో..



ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

జిల్లాలో వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలోని వంద పడకల ఏరియా ఆస్పత్రులు జంగారెడ్డిగూడెం, నూజివీడు, చింతలపూడి, 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కైకలూరు, 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు పోలవరం, బుట్టాయిగూడెం, దెందులూరు, భీమడోలు ప్రభుత్వాస్పత్రుల్లో నెలకొన్న సమస్యలపై 3వ తేదీ గురువారం ఉదయం 11-12 గంటల మధ్య 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' నిర్వహించనుంది. ప్రజలు

70136 20539

నెంబరుకు ఫోన్ చేసి సమస్యలను వివరిస్తే.. వాటి పరిష్కారానికి జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయ అధికారి డాక్టర్ బి.పాల్ సతీష్‌కుమార్ చర్యలు తీసుకుంటారు.



(వృత్తంలో) బావి, చుట్టూ ఆక్రమణలు

మంగ బావిని మింగేశారు

చింతలపూడి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న మంగ బావిని స్థానికులు ఆక్రమణలతో మింగేశారు. పాతబస్టాండ్ సమీపంలో 70 ఏళ్ల క్రితం బావి నిర్మించారు. అప్పట్లో పేదలు, మధ్య తరగతి కుటుంబాలు పంచాయతీ బావులపైనే ఆధారపడేవారు. వేసవిలో చెరువుల్లో నీరు లేక పంచాయతీ అధికారులు మంగ బావిని తవ్వినట్టు పెద్దల చెబుతారు. మొదట్లో నీరు పడలేదని, మరింత లోతు తవ్వడంతో నీటి లభ్యతతో స్థానికులకు దాహార్తి తీరిందని చెబుతుంటారు. బావిని చతురస్రాకారంలో నిర్మించి చుట్టూ ప్లాట్‌ఫారం కట్టారు. కొన్నేళ్లకు గొట్టపు బావులతో దీని వాడకం తగ్గింది. కాలక్రమేణా వాడకం తగ్గి పరిసరాలు ఆక్రమించేశారు. చెత్త పేరుకుపోయి బావి ఆనవాలు లేదు. ఈ బావిలో పెద్ద రావిచెట్టు కూడా మొలిచింది. చెట్టు చుట్టూ ఆక్రమించినా నగర పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోలేదు. ఆక్రమణలపై చర్యలు తీసుకుని నగర పంచాయతీకి స్థలం పరిరక్షించాలని పట్టణవాసులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

వేసవిలో పర్యాటకులకు ప్రత్యేక టూరిస్ట్ రైలు
8న సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్ర
7
పిల్లలు మందలించారని తండ్రి ఆత్మహత్య



రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్



ఈ రోజు మంచి రోజు.. రిజిస్ట్రేషన్ చేయిద్దాం.. అవసరమైన డబ్బు సమకూరింది ఇల్లు, భూమి రిజిస్ట్రేషన్ చేసేద్దాం.. చాలామంది ఇలాగే ఆలోచిస్తారు. రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగానే తక్షణం పని పూర్తయ్యేది. కొంతమంది గంటల తరబడి, రోజుల పాటు వేచి చూడాల్సి వచ్చేది. ఈ పద్ధతికి శుక్రవారం నుంచి తెరపడనుంది. స్లాట్ బుకింగ్ విధానం అమల్లోకి రానుంది. ప్రభుత్వం సూచించిన వెబ్‌సైట్‌లో ముందుగా నమోదు చేసుకుంటే ఏ రోజు, ఏ సమయంలో రిజిస్ట్రేషన్ అవుతుందనేది నిర్ధారణ అవుతుంది. సూచించిన రోజునే రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే ఇట్టే పని పూర్తవుతుంది. మిగతా శాఖల మాదిరిగానే రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలో కూడా వినూత్న మార్పులకు తెలుగుదేశం ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

నూతన విధానానికి ప్రభుత్వ శ్రీకారం

- తొలుత జిల్లా కేంద్రం నుంచే అమలు
- త్వరలో అన్ని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో..
- రిజిస్ట్రేషన్ ఎప్పుడనేది ముందుగానే నిర్ధారణ
- పూర్తి పారదర్శకత.. జాప్యం నివారణ
- దళారులు, సిఫార్సులకు చెక్
- అందరికీ అందుబాటులో సేవలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

రిజిస్ట్రేషన్ - స్టాంపులశాఖలో ప్రభుత్వం వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టింది. రిజిస్ట్రేషన్ నిమిత్తం వచ్చే వారికి సకల సౌకర్యాలు సమకూర్చాలని, ఎటువంటి లోటు రాకూడదని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఇంతకుముందే ఆదేశించారు. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే శాఖల్లో ఒకటైన రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ విభాగంలో ఎక్కడా జాప్యానికి తావులేదని అధికారులకు సున్నిత హెచ్చరికలు జారీ చేశారు. ఈ శాఖలో మార్పులు, చేర్పులకు మరో అడుగు ముందుకేశారు. జిల్లా కేంద్రాల్లో శుక్రవారం నుంచి ఇక రిజిస్ట్రేషన్లు స్లాట్ బుకింగ్ విధానంలోనే కొనసాగుతాయి. మిగతా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అతి త్వరలో అమలు చేస్తారు. స్లాట్ బుకింగ్‌లకు డిజిటల్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (డీక్యూఎంఎస్) పాటిస్తారు. ఇప్పటికే అంచెలంచెలుగా వస్తున్న మార్పులకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ చేసుకునే కక్షిదారులకు కూడా నూతన విధానంపై అవగాహన కల్పించేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ స్లాట్ బుకింగ్ విధానంపై అనేక మందికి పలు సందేహాలు లేకపోలేదు. ఇంతకుముందు మంచి, చెడ్డా ముహూర్తాలు చూసుకుని రిజిస్ట్రేషన్లు చేసేవారు. మంచి ముహూర్తం ఉన్న రోజు రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అర్ధరాత్రి వరకు పని చేసేవి. కానీ స్లాట్ బుకింగ్ విధానం అనంతరం అటు కక్షిదారులు, ఇటు రిజిస్ట్రేషన్ సిబ్బందికి కష్టాలు తొలగనున్నాయి.

స్లాట్ బుకింగ్ ఎలా..

పబ్లిక్ డేటా ఎంట్రీ (పీడీఈ) పద్ధతి ద్వారా స్లాట్ బుక్ చేసుకోవచ్చు. అధికారిక వెబ్‌సైట్ registration.ap.gov.inలో చేసుకోవచ్చు. క్యూఆర్‌కోడ్ స్కాన్ చేయడానికి ప్రతీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అందుబాటులో ఉంచారు. స్లాట్ విధానం తొలుత ఆరంభమైంది కాబట్టి అనుమానాలు, సందేహాలుంటే తక్షణం అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకోవాల్సి ఉంది.

రేపటి నుంచే నూతన విధానం

రిజిస్ట్రేషన్స్‌లో స్లాట్ బుకింగ్ విధానం శుక్రవారం నుంచి అమల్లోకి రానుంది. తొలి దశలో జిల్లా కేంద్రాల్లోనే ఈ విధానం అమలు చేస్తారు. ఏలూరు జిల్లా కేంద్రంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే కక్షిదారులు, సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు. తొలుత తడబాటు ఉన్నా తక్షణం సరిదిద్దుకోడానికి సిద్ధపడుతున్నారు.

నూతన విధానంలో ప్రయోజనాలు..

స్లాట్ బుకింగ్ విధానంతో రిజిస్ట్రేషన్ల కష్టాలకు తెలుగుదేశం ప్రభుత్వం తెరదించబోతోంది. సేవల్లో జాప్యం, సిఫార్సులు, దళారుల జోక్యం లేకుండా కక్షిదారులు మెరుగైన సేవలు పొందవచ్చు.

- స్లాట్ బుకింగ్ ద్వారా అపాయిమెంట్ తేదీ, సమయాన్ని కూడా ముందే తెలుసుకోవచ్చు.
- నిర్దేశిత తేదీ, సమయంలో ఎటువంటి హడావుడి లేకుండా రిజిస్ట్రేషన్ పని పూర్తి చేసుకోవచ్చు.
- రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో గంటల తరబడి వేచి ఉండటం, ఆందోళన చెందడం ఇక కనిపించదు.
- కొనుగోలుదారులు, అమ్మకం దారులు, సాక్షులు తగిన సమయంలోనే రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు చేరుకోవడానికి వీలు కలగనుంది.
- పారదర్శకతతో మధ్యవర్తుల ప్రభావానికి తెరపడనుంది.
- అనధికారిక కార్యకలాపాలు, అవినీతికి చెక్ పెట్టినట్లే.
- తిరస్కరణలు నివారించడానికి కొత్త విధానం మేలు.



ముఖ్యమంత్రి చంద్రబాబుతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు

సీఎంను కలిసిన గన్ని

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పార్టీ అంశాలను చర్చించేందుకు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు బుధవారం సీఎం చంద్రబాబును కలిశారు. వివిధ అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. తాజా పరిస్థితులపై గన్ని సీఎంకు వివరించే ప్రయత్నం చేశారు.



రైల్వే లైన్ల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

ఎంపీ పుట్టా మహేశ్

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైల్వే లైన్ల అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ తెలిపారు. బుధవారం లోక్‌సభలో లేవనెత్తిన ప్రశ్నలకు కేంద్ర రైల్వే శాఖ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానాలు ఇచ్చారు. రాజధాని అమరావతికి రైల్వే లైన్ అనుసంధానం చేస్తున్నామని, భద్రాచలం-కొవ్వూరు రైల్వే లైన్ ప్రాజెక్టు పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్టు స్పష్టం చేశారు. రూ.2155 కోట్లతో చేపట్టిన భద్రాచలం-కొవ్వూరు రైల్వే లైన్ ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో రైల్వే సమస్యలను ఎంపీ ప్రస్తావించారు. కేంద్ర రైల్వే, రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో రైల్వే ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని, పూర్తికి చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్ర మంత్రి తెలిపారు.

నేటి నుంచి అంగన్‌వాడీల్లో ఆధార్ శిబిరాలు

ఏలూరు సిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఆరేళ్ల లోపు పిల్లల ఆధార్ నమోదుకు ఈ నెల 3 నుంచి 11 వరకు శిబిరాలు నిర్వహించనున్నారు. నోడల్ అధికారి, జడ్పీ సీఈవో కె.భీమేశ్వర్ బుధవారం వివరాలు తెలిపారు. జిల్లాలో 9212 మంది జనన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఆధార్ నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. ఆధార్ నమోదుతో పాటు బయోమెట్రిక్, డాక్యుమెంట్ అప్‌డేట్‌కు ప్రత్యేక ఆధార్ శిబిరాలను వినియోగించుకోవచ్చన్నారు. ఈ నెల 3 నుంచి 5 వరకు, 8 నుంచి 11 వరకు శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు ప్రత్యేక ఆధార్ క్యాంపులను నిర్వహించాలని జడ్పీ సీఈవో సూచించారు.

నీటి తీరువా వసూళ్లకు ఆన్‌లైన్ గండం



(ఏలూరు- ఆంధ్రజ్యోతి)

- భూమి శిస్తు రూ.22.13 కోట్లు
- వసూలైంది కేవలం రూ.2.44 కోట్లు
- కాల్వల మరమ్మతులకు కష్టకాలం
- వసూళ్లకు రెవెన్యూ శాఖ పర్యవేక్షణ లేకపోవడంతో సమస్య

రెవెన్యూ వ్యవస్థలో గ్రామ స్థాయిలో వీఆర్వో, ఇతర సిబ్బంది పోటీపడి నీటి తీరువా (భూమి శిస్తు) వసూలు చేసేవారు. 2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి వైసీపీ ప్రభుత్వం నీటి తీరువా వసూళ్లను ఆన్‌లైన్ ద్వారా వసూలు చేయాలని ఉత్తర్వులు ఇవ్వడంతో వసూళ్లు కుంటుపడ్డాయి. రైతులు తీరిక లేకపోవడం, అడిగే వారు ఎవరుంటారరనే ధీమాతో బకాయిలు చెల్లించ లేదు. గతంలో పంట చేతికి రాగానే రైతులంతా భూమి శిస్తు చెల్లించేవారు. ఏలూరు జిల్లాలో 1432 ఫసలీ కాలానికి రూ.22.13కోట్లు నీటి తీరువా వసూలు కావాల్సి ఉంది. ఇప్పటి వరకు కేవలం రూ. 2.44 కోట్లు వసూలైంది. కనీసం 10 శాతం కూడా వసూలు కాలేదు. నీటి తీరువా కింద చేపల చెరువుకు ఎకరాకు రూ. 500, వరి చేలకు ఎకరా రూ.200 మేర రైతులు చెల్లించేవారు. మూడేళ్ల నుంచి బకాయిలు పేరుకుపోతున్నాయి. వసూలైన మొత్తంలో 70 శాతం సాగునీటి కాల్వ మరమ్మతులకు నీటి సంఘాల ద్వారానే చేయించేవారు. శిస్తు వసూలు కాకపోవడంతో పనులు చేపట్టడం లేదు. ప్రస్తుతం శిస్తు చెల్లించిన, చెల్లించని వారి వివరాలు కూడా తెలియని దుస్థితి నెలకొంది. ఆన్‌లైన్ విధానం రైతుకు వెసులుబాటు అయినా చెల్లింపులు లేవు. గ్రామ సచివాలయ వ్యవస్థలో డిజిటల్ అసిస్టెంట్లే వీటి వ్యవహారాలను చూస్తున్నారు. రైతు ఆధార్ కార్డును చూపించి పొలం ఉండే ప్రాంతం నుంచి లేదా వేరే ఊళ్లో నివసించినా అక్కడ నుంచి ఆన్‌లైన్‌లో శిస్తు బకాయిలు కట్టడానికి అవకాశం కల్పించినా ఆ విధంగా జరగడం లేదు.

జమాబందీ నాటికే బకాయిలన్నీ వసూలయ్యేవి..

జిల్లా రెవెన్యూ అధికారి పర్యవేక్షణలో ఆర్డీవోలు, తహసీల్దార్లు రైతుల నుంచి ఫసలీ కింద ఏటేటా రెవెన్యూ శిస్తు వసూళ్లను చేపట్టేవారు. దీనికి జమాబందీ ద్వారా మండల స్థాయిలో జిల్లా అధికారులు వెళ్లి ఆకస్మికంగా తనిఖీలు చేసి పుస్తకాల్లో నమోదైన దానికి ఆయా మొత్తాలు సరిగ్గా ఉన్నాయో? లేదో కూడా తనిఖీలు చేసేవారు. మూడేళ్ల నుంచి ఈ విధానానికి స్వస్తి పలికారు. ప్రభుత్వం నీటి తీరువా వసూళ్లపై రెవెన్యూ శాఖ ద్వారా చర్యలకు ఉపక్రమించాల్సిన అవసరం ఉంది. భూమి శిస్తు బకాయిల చెల్లింపు వ్యవహారంలో జమ అయిన మొత్తం కాల్వలు, ఇతర పనులకు నిర్వహణకు ఉపయోగించకుండా మురిగిపోతున్నాయి. దీనిపై ప్రభుత్వం సరైన రీతిలో స్పందించాల్సి ఉంది.



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి ఆమ్రపాలి, కలెక్టర్ వెట్రిసెల్వి

అభివృద్ధి, సంక్షేమంలో నెంబర్ 1

అన్ని శాఖల లక్ష్యం ఇదే కావాలి

- అధికారులు పక్కా ప్రణాళిక, కార్యాచరణతో ముందుకు వెళ్లండి
- లక్ష్యాలను చేరే వరకు విశ్రమించొద్దు
- వ్యవసాయంతోపాటు పర్యాటకాన్ని తీర్చిదిద్దండి
- జిల్లా అధికారిక సమీక్షలో జిల్లా ప్రత్యేక అధికారి ఆమ్రపాలి

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

జిల్లాలో పాలనా వ్యవహారాల్లో కీలక మార్పులు, చేర్పుల దిశగా తెలుగుదేశం ప్రభుత్వం సకల సన్నాహాలు చేస్తుంది. ఇన్‌చార్జి మంత్రులు జిల్లాల్లో విస్తృతంగా పర్యటించాలని ఇప్పటికే ఆదేశించారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం కావాలని, ఎక్కడికక్కడ సమస్యల పరిష్కారానికి అనువైన నిర్ణయాలు తీసుకోవాల్సిందిగా కోరారు. సమాంతరంగా జిల్లా పాలనా వ్యవహారాలను చక్కదిద్దే దిశగా ఇంతకుముందున్న పద్ధతిని మరోసారి ముందుకు తెచ్చారు. జిల్లా స్థాయిలో స్పెషల్ ఆఫీసర్లను రంగంలోకి దించారు. ఏలూరు జిల్లా వ్యవహారాలను పరిశీలించేందుకు ప్రత్యేక అధికారిగా కె.ఆమ్రపాలిని నియమించారు. ప్రత్యేకాధికారి హోదాలో బుధవారం జిల్లా కేంద్రానికి చేరుకున్న ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించారు. పాలనా వ్యవహారాల్లో చురుగ్గా వ్యవహరించాలంటూనే రాష్ట్ర స్థాయిలో జిల్లాను తొలి వరుసలో చేర్చే బాధ్యత మీదేనంటూ దిశ, నిర్దేశం చేశారు. అన్ని శాఖల అధికారులు నెంబర్ స్థానం లక్ష్యంగా తగిన ప్రణాళిక, కార్యాచరణతో పథకాలు అమలు చేయాలని సూచించారు.

సమీక్షలో ఏమన్నారంటే..

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ఏలూరు జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపాలి. దీనికి అధికారులు కనీస లక్ష్యాలతో తగినంత కృషి చేయాల్సిందే. అందరికీ కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత సమయంలోనే పూర్తి చేయాలి. ఏలూరు జిల్లాను రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు లభించేలా ప్రగతి పథంలో నిలపాలి. వ్యవసాయ ప్రధానమైన ఏలూరు జిల్లాలో సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంను పెంపొందించాలి. రైతులకు ప్రభుత్వం ఇచ్చే చేయూతపై అవగాహన కల్పించాలి. ఈ తరహా వ్యవసాయం మరింత విస్తరించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఉద్యానవన పంటలకు, ఆక్వా పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద ఈ ఆర్థిక సంవత్సరంలో కూలీలకు పని దినాలు, చేపట్టాల్సిన పనులపై అధికారులను ఆరా తీశారు. ఇప్పటిదాకా ఏ తరహా పనులు కల్పిస్తున్నారు, ఎంత మంది ఉపాధి పొందుతున్నారనేది అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ల పంపిణీ తీరుపైన సమీక్షించారు. ప్రతీనెలా 98 శాతం పైబడే ఒకటో తేదీన పింఛన్లు పంపిణీ చేస్తున్నామని, పింఛన్లు తీసుకుంటున్న వారిలో చనిపోయిన వారి సంఖ్య ఐదారొందలకుపైగానే ఉంటుందని అధికారులు సమాధానమిచ్చారు. పంపిణీ వ్యవహారాన్ని ముందస్తు బేరీజు వేసుకునే క్రమ పద్ధతిలో కొనసాగిస్తున్నట్టు ఆమ్రపాలికి వివరించారు. స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు గురించి ప్రత్యేక అధికారి ఆమ్రపాలి ఆరా తీశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ వ్యవహారాలను చక్కబెడుతున్న అధికారులు అప్రమత్తంగా ఉండాలని, తగిన పురోభివృద్ధి సాధించాలని సూచనలు చేశారు. అలాగే జిల్లాలో వ్యవసాయం, ఆక్వా ఎంత ప్రాధాన్యత కలిగినవో సమాంతరంగా పర్యాటకాన్ని అభివృద్ధిపరిచే దిశగా ప్రణాళిక రూపొందించాల్సిందిగా ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు, పాపికొండలు, కొల్లేరు ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకంటున్నారంటూ ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. తొలి సమీక్షలోనే తనకున్న అనుభవంతో ముఖ్య శాఖల పనితీరును ఆరా తీసి సమాధానాలు రాబట్టారు.

సాదర స్వాగతం

తొలిసారి జిల్లాకు వచ్చిన ప్రత్యేక అధికారి కె.ఆమ్రపాలికి కలెక్టర్, వివిధ శాఖాధిపతులు సాదరంగా స్వాగతం పలికారు. ఎన్జీవో నేతలు కూడా ఆమ్రపాలిని కలిసి ఆమెకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

మేమేం చేస్తున్నామంటే..

జిల్లా వ్యాప్తంగా అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని కలెక్టర్ వెట్రిసెల్వి ప్రత్యేక అధికారి ఆమ్రపాలికి వివరించారు. పింఛన్లు ప్రతీనెలా రూ.112.5 కోట్లు పంపిణీ చేస్తున్నామని, దాదాపు 98 శాతం వరకు పంపిణీ పూర్తవుతుందన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు బ్రాండ్ ఇమేజ్ కల్పించి ఆన్‌లైన్ మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాలలో ప్రగతి సాధిస్తున్నామని, ఉద్యాన పంటల్లో ఆయిల్‌పాం అధిక విస్తీర్ణంలో సాగవుతుంది, కోకో పంటగా అంతర పంటగా 35 వేల ఎకరాల్లో విస్తరించి ఉందని ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకువచ్చారు.



ధర్మం శరణం గచ్ఛామి !

పిల్లలతో యాచక వ్యాపారం

ధర్మం శరణం.. గచ్ఛామి.. దానం శరణం గచ్ఛామి.. అంతో.. ఇంతో ఇచ్చినవారికి ఇహమే స్వర్గం..లేదిక మరుజన్మం.. ఈ సినిమా పాటలోని సన్నివేశం ఎంత దయనీయంగా ఉంటుందో అంతే దయనీయ పరిస్థితి భీమవరంలోనూ కనిపిస్తుంది..గుడి, చర్చి, మసీదు ఇలా ఎక్కడైనా బిక్షగాళ్ల తాకిడి పెరిగిపోయింది. ఎంతోకొంత ఇచ్చేదాకా వదలరు.. వారితో పాటు చిన్న చిన్న పిల్లలను కూడా యాచక వృత్తిలోకి దింపేస్తున్నారు. చంటి పిల్లలతో అడిగితే డబ్బులు బాగా వస్తాయని కొంతమంది యాచకులు తమ పిల్లలను కూడా యాచకులుగా మారుస్తున్నారు. పిల్లలు లేనివారు అద్దెకు తెచ్చుకుని మరీ యాచన చేస్తున్నారని సమాచారం.. వారిపై చర్యలు తీసుకోవలసిన శాఖలు మౌనంగా ఉండడంతో భీమవరం పట్టణంలో రోజురోజుకు ఇలా భిక్షాటన చేసుకునే వారి సంఖ్య పెరుగుతోంది.






భీమవరం పట్టణంలో వివిధ ప్రాంతాల్లో భిక్షాటన చేసుకుంటున్న చిన్నారులు..

-ఫొటోగ్రాఫర్, భీమవరం



బంటుమిల్లిలో ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలంటూ బొట్టుపెట్టి ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

పిల్లలను ప్రభుత్వ బడులకు పంపండి

బంటుమిల్లిలో బొట్టుపెట్టి పిలిచిన ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ సభ్యులు

పాలకోడేరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : శృంగవృక్షం గ్రామపంచాయతీ పరిధిలో గల బంటుమిల్లి గ్రామంలో మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఎస్‌ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడం కోసం వినూత్నంగా అక్షర పేరంటం అనే కార్యక్రమం నిర్వహించారు. బుధవారం కమిటీ సభ్యులందరూ కలిసి గ్రామంలో కాన్వెంట్లు, ఇతర ప్రైవేట్ పాఠశాలల్లోకి వెళ్తున్న విద్యార్థుల తల్లిదండ్రులను స్వయంగా కలిసి ప్రభుత్వ పాఠశాలలో జాయిన్ అయిన పిల్లలు మంచిగా చదువుతున్నారని, పాఠశాలలో ఉన్న సౌకర్యాలను కరపత్రం ద్వారా వారికి తెలియజేసి బొట్టు పెట్టి తమ పాఠశాలలో చేర్పించవలసినదిగా ఆహ్వానించారు. అంతే కాకుండా ప్రైవేట్ స్కూళ్ళకు పిల్లలను బస్సులలో, ఆటోలలో ఉదయాన్నే పంపాల్సిన బాధలు లేకుండా మన ఊరి పాఠశాలలోనే అన్ని వసతులు, ఐదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులు, ఇంగ్లిష్ మీడియం బోధన, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్, మధ్యాహ్న బడిభోజనం, మినరల్ వాటర్, విశాలమైన తరగతి గదులు, పిల్లలందరికీ సరిపడా ఫర్నీచర్, ఫ్యాన్లు, గ్రీన్ బోర్డులు, ఇంటర్నెట్ కనెక్షన్‌తో కూడిన స్మార్ట్ టీవీల ద్వారా విద్యా బోధన కార్పొరేట్ వసతులతో సమానంగా ఉన్నదని వివరించారు. మొదటి విడత ప్రచారంలో గ్రామ పెద్దలందరూ పాల్గొనగా రెండో విడతలో ఎస్‌ఎంసీ సభ్యులందరూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రామానుజరావు, ఎస్‌ఎంసీ ఛైర్మన్ పాల లీలాకుమారి, వైస్ ఛైర్మన్ జంగం మనోహర్, ఎంపీటీసీ సభ్యులు మల్లుల సూర్య కళా శ్రీనివాసరావు, ఎస్‌ఎంసీ సభ్యులు కవురు సత్యధనలక్ష్మి, పాల సూర్య పాటి మహాలక్ష్మి, పాల లక్ష్మీదుర్గ, కవురు దుర్గ, దొంగ హేమలత, కొయ్యే దేవమణి, హిందీ టీచర్ కవురు రాణి, కోడి వెంకట కనకలక్ష్మి, విప్పర్తి థామస్, పాల్గొన్నారు.



ఉగాది వేడుకల్లో ఆకట్టుకున్న నృత్యపోటీలు

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఉగాది నాటక పోటీల్లో భాగంగా బుధవారం తాడేపల్లిగూడెం బుద్దాల కన్వెన్షన్ హాలులో నృత్య పోటీలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. బీవీఆర్ కళా కేంద్రం వ్యవస్థాపకుడు బుద్దాల వెంకట రామారావు పర్యవేక్షించారు.



జోరుగా విసనకర్రల విక్రయాలు

ఫ్యాన్‌లు లేని సమయంలో వేడి నుంచి రక్షణకు ఇవే ఉపయోగపడేవి.. కరెంటు పోతే వెంటనే చేతిలోకి విసనకర్ర వచ్చేది.. ప్రస్తుతం వీటికి సీజన్ రావడంతో మార్కెట్‌లో విరివిరిగా అమ్మకాలు సాగుతున్నాయి. జంగారెడ్డిగూడెం ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు తణుకు ప్రధాన రహదారుల వెంబడి విసనకర్రలు విక్రయిస్తున్నారు. కాలం మారినా విసన కర్రలకు మాత్రం డిమాండ్ తగ్గలేదు. వేసవి కావడంతో పలువురు వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఒక్కొక్కటి 60 రూపాయలు చొప్పున విక్రయిస్తున్నారు.

-తణుకు (ఆంధ్రజ్యోతి)

నిప్పుతో ఆటలొద్దు !

వేసవిలో అగ్ని ప్రమాదాలకు అవకాశం

ముందు జాగ్రత్తలతో దూరం

గ్యాస్, విద్యుత్, బాణసంచాల పట్ల అప్రమత్తత అవసరం



గతేడాది శ్రీరామనవమి వేడుకల్లో బాణసంచా పడి దువ్వ వేణుగోపాలస్వామి ఆలయంలో అగ్నిప్రమాదం (ఫైల్)

నిడమర్రు ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నిప్పుతో చెలగాటం వద్దంటారు పెద్దలు. నిర్లక్ష్యం చేస్తే అది మన ఆస్తుల్ని, నివాసాల్ని, చివరకు మనల్ని కూడా దహించివేస్తుంది. వేసవి కాలం..ఎండలు మండుతున్న వేళ అగ్ని ప్రమాదాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తతో ఉండడం ద్వారా క్షేమంగా, సురక్షితంగా ఉండవచ్చు. మిగతా కాలాలతో పోలిస్తే వేసవికాలం అగ్ని ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుంది.

గడ్డివాములతో జాగ్రత్త

వేసవిలో గడ్డివాముల ఎక్కువగా అగ్నికి ఆహుతవుతుంటాయి. గడ్డి తోలుకొని వెళ్లే ట్రాక్టర్లు, లారీలు తమ రవాణాలో విద్యుత్ తీగలు కింద నుంచి వెళ్లేసమయంలో అత్యంత జాగ్రత్తగా వెళ్లాలి. అలాగే గడ్డివాములు నిల్వ చేసే ప్రదేశం విద్యుత్ తీగలకు 15 మీటర్ల దూరంలో ఉండాలి. గడ్డివాములను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. కుర్రాళ్ల బీడీ, సిగరెట్లు చాటుగా తాగుతూ గడ్డివాముల వద్ద వదలివేస్తుంటారు.



గ్యాస్ సిలెండర్లు

వేసవి అగ్ని ప్రమాదాల్లో రెండోస్థానం గ్యాస్ సిలెండర్ ప్రమాదాలే ఎక్కువ. గ్యాస్ సిలెండర్లను వాడే సమయంలో రెగ్యులేటర్ సరిగా కట్టక అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే రెగ్యులేటర్ నుంచి గ్యాస్ పొయ్యికి వచ్చే రబ్బరు పైప్‌ను ఎప్పటికప్పుడు చూసుకొంటూ ఉండాలి. అవసరమైతే కొత్తది వేసుకోవాలి. వేసవిలో ఊర్లు వెళ్లే సమయంలో రెగ్యులేటర్ కనెక్షన్ తొలగించి గ్యాస్ బండ్‌కు బిరడా మూతి బిగించాలి.

పాత వైరింగ్‌తో షార్ట్‌సర్క్యూట్ సమస్యలు

వేసవిలోనే కాదు అనునిత్యం అగ్ని ప్రమాదాలు సంభవించే ఏకైక అవకాశం విద్యుత్ వైర్లు ద్వారా జరుగుతుంది. వేసవిలో లోఓల్టేజ్, హైఓల్టేజ్ సమస్యల వల్ల నాసిరకం విద్యుత్ వైర్లు కాలిపోయి మొత్తం ఇంటిని అగ్నికి ఆహుతి చేస్తుంది. ఇటీవల పరిమెళ్ల గ్రామంలో పాత వైరింగ్ వల్ల షార్టు సర్క్యూట్ జరిగి ఇల్లంతా బూడిదైంది. అలాగే పెట్రోలు బంకుల వద్ద కూడా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండడం ద్వారా అగ్ని ప్రమాదాలను నివారించవచ్చు. పెట్రోలు కొట్టించుకొనే సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడకుండా ఉండడం మంచిది.

> ఏలూరు జిల్లాలో 7 ఫైర్ స్టేషన్లు ఉండగా 8 అగ్ని మాపక వాహనాలు పనిచేస్తున్నాయి. 98 మంది సిబ్బంది ఉన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 7 ఫైర్ స్టేషన్లు ఉండగా 7 వాహనాలు పనిచేస్తున్నాయి. ఇక్కడ 96 మంది సిబ్బంది విధుల్లో ఉంటున్నారు.

ముందు జాగ్రత్తలు తప్పనిసరి

- పూరి గుడిసెలలో పొయ్యి వెలిగించి బొగ్గులను పూర్తిగా ఆర్పకుండా చెత్తకుప్పలలో వేయడం వల్ల మంటలు వ్యాప్తి చెందుతున్నాయి. వీటిని నివారించాలి.
- మహిళలు వంట,వార్పు అయిన తర్వాత తప్పనిసరిగా గ్యాస్ స్టవ్ రెగ్యులేటర్, బర్నర్‌లను కట్టివేయాలి. గ్యాస్ సిలెండర్ పరిస్థితి ఆరునెలలకోసారి పరీక్షించుకోవాలి.
- పురాతన ఇళ్లలో ఉపయోగించిన నాసిరకం విద్యుత్ వైర్లు వల్ల, డ్యామేజీల వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించడం ఇటీవల ఎక్కువగా చూస్తూనే ఉన్నాం. పాతవి, డ్యామేజీ అయిన విద్యుత్ వైర్లు ఎప్పటికప్పుడు తొలగించాలి.
- ఇటీవల కాలంలో మ్యారేజ్ ఫంక్షన్లు, రాజకీయ సమావేశాల్లో, జాతర ఉత్సవాల్లో మందుగుండు సామాగ్రి పేల్చుతున్నారు. అవి అదుపుతప్పి ఒక్కోసారి ఇళ్లు, గడ్డివాములపై పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. బాణసంచా కాల్చే సమయంలో అప్రమత్తత అవసరం
- పట్టణాలలో పెద్ద ఫ్యాక్టరీలలో, దీర్ఘకాలం వాడిన పరికరాల వల్ల అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రతి సంవత్సరం ఫైర్ సేఫ్టీ ఆడిట్ చేయించుకోవాలి.
- అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే 101కి సమాచారం ఇవ్వాలి. స్టేట్ ఫైర్ కంట్రోల్ రూమ్ 91001 08101 నంబర్‌కు సమాచారం ఇవ్వడం ద్వారా ప్రమాదాల నుంచి రక్షించుకోవచ్చును.

జాగ్రత్తలతోనే ప్రమాదాలకు దూరం



ఏలూరు జిల్లాలో ప్రస్తుతం ఉన్న ఆరు అగ్నిమాపక కేంద్రాలతో పాటు కుక్కునూరులో తాత్కాలికంగా 7వ కేంద్రం ఏర్పాటు చేశారు. అగ్ని ప్రమాదాలు ఎక్కువగా మానవ తప్పిదం వల్లే జరుగుతుంటాయి. అందువల్ల మహిళలు వంట చేసే సమయంలో పూర్తి జాగ్రత్తతో వ్యవహరించాలి. పురాతన భవనాలలో కాలం చెల్లిన విద్యుత్ వైర్లు, పరికరాలు తొలగించి ఐఎస్ఐ మార్కు కల్గిన నూతన విద్యుత్ పరికరాలు అమర్చుకోవాలి. వేడుకల సమయంలో మందుగుండు సామాగ్రి పేల్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

-సీహెచ్ రత్నబాబు , జిల్లా అగ్నిమాపక అధికారి ఏలూరు

తూర్పు యడవల్లిలో వసంత నవరాత్రి ఉత్సవాలు

కామవరపుకోట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని చిన్న భద్రాద్రిగా పేరొందిన ద్వారకా తిరుమల దేవస్థానం దత్తత ఆలయమైన కామవరపుకోట మండలం తూర్పుయడవల్లి సీతా రామాలయంలో వసంత నవరాత్రి శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం తొళక్కం వాహనంపై సీతా రామలక్ష్మణ హనుమంతుల వారిని అలంకరించి గ్రామంలో మేళతాళాలు, బాజా భజంత్రీలతో గ్రామోత్సవం నిర్వహించారు. వీధివీధిన స్వామి వారికి భక్తులు హాజరుతులు ఇచ్చారు. 6వ తేదీన సీతారాముల కళ్యాణ మహోత్సవం అనంతరం పట్టాభిషేక మహోత్సవాన్ని జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలియజేశారు.



తొళక్కం వాహనంపై సీతారాములు

బెట్టింగ్ యాప్‌లతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

భీమవరం క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, పేకాట, బెట్టింగ్‌లు వంటివి నిర్వహించినా సంఘ విద్రోహులుగా నిర్ధారించి వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని భీమవరం టూటౌన్ సీఐ కాళీచరణ్ అన్నారు. ఇటీవల భీమవరం పట్టణంలోని ఒక లాడ్జిలో పేకాట ఆడుతుండగా కొంత మందిని అరెస్ట్‌చేసి వారి వద్ద భారీగా సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. దీంతో వాటిపై దృష్టి పెట్టారు. హోటళ్ళు, లాడ్జీల యజమానులకు సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఎవరైనా గుర్తింపు కార్డు లేకుండా వస్తే రూమ్‌లు ఇవ్వవద్దని, అలాగే రూమ్‌లు తీసుకున్న వారిపై నిఘా ఉంచాలని సూచించారు. ప్రత్యేక నిఘా విభాగం ఈ బెట్టింగ్ యాప్‌ల పనితీరుపై పరిశీలిస్తుంటుందని, బెట్టింగ్‌లు ఆడేవారి నెంబర్లను పర్యవేక్షణలో ఉంచుతున్నామన్నారు.

స్కూళ్లల్లో దాహం కేకలు

ఉంగుటూరు ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు అంటూ హడావుడి చేసి ఒక్కో పాఠశాలలో లక్షలాది రూపాయిలు వెచ్చించిన తాగునీటి పథకాలు అంతంత మాత్రంగానే పనిచేస్తున్నాయి. ఉంగుటూరు మండలంలోని ఉంగుటూరు, నారాయణపురం, కైకరం హైస్కూళ్లలో నాడు-నేడు పథకంలో సుమారు రూ.5 లక్షలతో నిర్మించిన తాగునీటి పథకాలు పనికి రాకుండా పోయాయి. దీంతో విద్యార్థులు పలు పాఠశాలల్లో దాతలు అందించిన లేదా ఇంటి నుంచి , చుట్టుపక్కల నుంచి బాటిళ్లలో నీరు తెచ్చుకుని దాహార్తిని తీర్చుకుంటున్నారు. ఎండలు మండిపోతున్న ఈ సమయంలో విద్యార్థులకు తగిన విధంగా తాగునీరు సరఫరా కాకపోవడంపై పిల్లల తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉంగుటూరులో రైల్వే గేటు అవతల హైస్కూలు ఉండడం ఆ ప్రాంతంలో లోవోల్టేజీ సమస్య కారణంగా మోటార్ పని చేయకపోవడంతో నీటికి సమస్య ఏర్పడింది. ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ చొరవతో అప్పటికప్పుడు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అయినా హైస్కూలులో తాగునీటి సమస్య పరిష్కారం కాలేదు. పాఠశాలలో విద్యుత్తు మీటర్లు ఏర్పాటు చేసినా విద్యార్థులకు తగిన విధంగా తాగునీరు సరఫరా కావడం లేదని తల్లిదండ్రుల కమిటీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. కైకరం, నారాయణపురం, రాచూరు హైస్కూళ్లలో ప్రభుత్వం నీటి గంటలను సమయానుకూలంగా నిర్వహించడం లేదని వీటి నిర్వహణ అంతంత మాత్రమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఉంగుటూరు స్కూల్‌లో ఉపయోగం లేని వాటర్‌ప్లాంట్



కైకరంలో నీరు రాని ట్యాప్‌లు





చెట్టు చెట్టుకూ ఓ సందేశం..

కొమ్మ కొమ్మకో సన్నాయి...కోటి రాగాలు ఉన్నాయీ..అంటూ ఒక సినిమా పాటలో రాసినట్లుగా తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని ప్రతీ చెట్టు ఓ సందేశాన్ని ఇస్తున్నాయి. కళాశాల తరగతి గదిలోని నల్ల బోర్డులే కాకుండా ఆరుబయట చెట్లు కూడా విద్యార్థులకు, సందర్శకులకు విజ్ఞానాన్ని అందిస్తున్నాయి. కళాశాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకుల మార్గదర్శకత్వంలో ఆవరణలోని చెట్లపై వివిధ అంశాలకు చెందిన చిత్రాలను చిత్రీకరించారు. వీటిలో పర్యావరణం, మొక్కల పెంపకం, పరిసరాల పరిరక్షణ, నీటి సంరక్షణ, వంటి అంశాలతో పాటు భోదిసత్వుడు, పక్షులు, వంటి అంశాలకు సంబంధించిన చిత్రాలను ఆయిల్ పెయింట్‌తో ఆకర్షణీయంగా చిత్రీకరించారు. దీంతో కళాశాలలో ప్రవేశించిన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు, ఇతర సందర్శకులకు కళాశాల ఆవరణ ఆహ్లాదకరంగా, వినోదభరితంగా చూడముచ్చటగా వుంది.

- తణుకు రూరల్ (ఆంధ్రజ్యోతి)







పెరిగిన టోల్‌ప్లాజా చార్జీలు

పెదపాడు/ఉంగుటూరు ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులపై వున్న టోల్‌ప్లాజాల వద్ద వాహనాల ప్రవేశ రుసుం పెంచింది. దీనిపై వాహనదారులు గగ్గోలుపెడుతున్నారు. కొత్తరేట్ల ప్రకారం ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి వచ్చాయి.

	కలపర్రు టోల్‌ప్లాజా		ఉంగుటూరు టోల్‌ప్లాజా	
వాహనం	పాత రేట్లు	పెరిగిన రేట్లు	పాత రేట్లు	పెరిగిన రేట్లు
కారు/జీపు/వ్యాను	70	75	110	115
లైట్ కమర్షియల్	115	120	180	190
బస్/ట్రక్	240	245	380	395
త్రీ యాక్సిల్ కమర్షియల్ వాహనం	260	270	415	430
ఫోర్ టు సిక్స్ యాక్సిల్ వాహనం	375	390	595	615
ఓవర్ సైజ్ వాహనం	455	470	725	750



మొగల్తూరులో డంప్ చేసిన చెత్తను టిప్పర్‌లో లోడు చేస్తున్న జేసీబీ

క్లీన్ మొగల్తూరు కార్యాచరణ ప్రారంభం

మొగల్తూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవతో చేపట్టిన క్లీన్ మొగల్తూరు కార్యాచరణకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ నెల 1న మండల స్థాయి అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ పేషీ నుంచి చెత్త సమస్య పరిష్కారం చూపుతూ కార్యాచరణ రూపొందించాలని వచ్చిన ఆదేశాలు 24 గంటలు గడవక ముందే మొగల్తూరులో డంప్ చేసిన చెత్తను ప్రత్యేక టిప్పర్ లారీలతో నరసాపురం తరలింపు పనులు బుధవారం చేపట్టారు. మొగల్తూరులో డంపింగ్‌యార్డ్ లేక రహదారి, చెరువుల వెంబడి డంప్ చేసిన చెత్త సమస్యను పరిష్కరించాలని గత నెల 28న గ్రామాభివృద్ధి సభలో రైతు కొత్తపల్లి చిరంజీవి రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఈ సమస్యను కృష్ణ తేజ స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి సమస్య పరిష్కరించాలని సూచించడంతో బుధవారం రెండు భారీ టిప్పరు లారీలను స్వచ్ఛాంధ్ర పథకం నుంచి మొగల్తూరు పంపించి నరసాపురం తరలింపు పనులు చేపట్టారు. ముందుగా ఈ చెత్తను విశాఖకు తరలించాలని ప్రణాళిక రూపొందించగా భారీ ఖర్చు కావడంతో నరసాపురం తరలించాలని యోచించారు. దీంతో మొగల్తూరులో గల డంప్ చేసిన చెత్తను పూర్తి స్థాయిలో గురువారం నుంచి మరిన్ని ఎక్కువ టిప్పర్ లారీలు వినియోగించి తరలించేలా ఏర్పాట్లు చేశారు. నరసాపురంలో ఈ చెత్తను ఐదు కేటగిరీలుగా వేరు చేసి స్వచ్ఛ ఆంధ్ర సిబ్బంది వినియోగంలోకి తీసుకువస్తారని స్వచ్ఛ ఆంధ్ర సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాస్, బి.వెంకటేశ్ తెలిపారు.

టెన్షన్.. టెన్షన్

జిల్లా మదుపుదారుల్లో ట్రంప్ సుంకాల భయం

ఇప్పటికే భారీగా నష్టపోయిన ఇన్వెస్టర్లు

ప్రతీకార సుంకాలు విధిస్తే నేడు ఇండెక్స్ భారీ పతనం !



నరసాపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):స్టాక్ మార్కెట్ మదుపుదారుల్లో ట్రంప్ విధించే సుంకాల టెన్షన్ నెలకొంది. ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తరువాత మార్కెట్ భారీగా పతనమైంది. చాలామంది ఇన్వెస్టర్లు నష్టాలను మూటగట్టుకున్నారు. కొద్ది రోజుల నుంచి ట్రంప్ భారత్‌పై ప్రతీకార సుంకాలు తప్పవని హెచ్చరించడంతో స్టాక్ మార్కెట్ తీవ్ర ఒడిదుకులకు లోనవుతూ వస్తున్నది. మంగళవారం భారీ పతనాన్ని నమోదు చేసుకుంది. బుధవారం మార్కెట్‌లో కొద్దిగా రికవరీ ఉన్నప్పటికీ గురువారం సుంకాల ప్రభావంతో ఇండెక్స్ ఎలాంటి పతనాన్ని నమోదు చేసుకుంటుందోనన్న భయం మదుపుదారులను వెంటాడుతోంది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ అధికారంలోకి వస్తే స్టాక్ మార్కెట్ దూసుకుపోతుందని జిల్లాలోని ఇన్వెస్టర్లు భావించారు. అయితే ట్రంప్ గెలిచిన దగ్గర నుంచి ప్రతీకార సుంకాల గురించే మాట్లాడుతుండటంతో మార్కెట్ భారీగా పతనమవుతూ వస్తున్నది. ఇటీవల కొద్దిగా రికవరీ అయినా ట్రంప్ భయం మాత్రం వీడలేదు, ఇతర దేశాలపై విధించిన మాదిరిగానే భారత్‌పైన పన్నులు వేస్తే మళ్లీ మార్కెట్‌లో పతనం తప్పదని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో చాలామంది మదుపుదారులు ఉన్న పెట్టుబడుల్ని తగ్గించుకున్నారు. కొందరు నష్టాలకు అమ్ముకోలేక కొన్న స్టాక్‌ను ఉంచేశారు. అయితే నేటి మార్కెట్ మరో బ్లాక్ డేను నమోదు చేసుకుంటుందా? లేక తటస్థంగా ఉంటుందా? అన్నది చర్చనీయాంశమైంది. రాష్ట్రంలోని పశ్చిమ స్టాక్ మార్కెట్ పెట్టుబడులకు పెట్టింది పేరు. బ్యాంకుల్లో వడ్డీ రేట్ల తగ్గడం, రియల్ ఎస్టేట్ పడిపోవడంతో చాలా మంది మదుపుదారులు స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతూ వచ్చారు. అయితే సెప్టెంబరు నుంచి మార్కెట్‌లో సూచిక రెడ్‌మార్క్‌లోనే క్లోజ్ అవుతూ వస్తుంది. ఈ కారణంగా కోట్లల్లో నష్టపోయారు. వీటి నుంచి గట్టెక్కుతామని ఆశతో ఎదురుచూసిన మదుపుదారులకు ట్రంప్ సుంకాల హెచ్చరికలు ఆశలపై నీళ్లు జల్లినట్లయింది.



మెప్మా అధికారులను అభినందిస్తున్న కలెక్టర్ నాగరాణి

స్వయం సహాయక ఉత్పత్తుల అమ్మకాల్లో రికార్డు

భీమవరం టౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 1.5 లక్షల స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను ఓఎన్‌డీసీ ప్లాట్‌ఫారమ్ ద్వారా అమ్మి గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను సాధించడం అభినందనీయమని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం భీమవరంలోని కలెక్టరేట్ ఛాంబర్‌లో కలెక్టర్‌ని మెప్మా అధికారులు కలిసి గిన్నిస్ బుక్ రికార్డ్స్, వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్లను చూపించారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారుచేసిన ఉత్పత్తులను ఓఎన్‌డీసీ వేదికగా ఒకేరోజు 1.50 లక్షల ఆర్డర్లను పొందినందుకు గుర్తింపుగా గిన్నిస్ రికార్డును ఆ సంస్థ ప్రతినిధులు అందజేశారని, దీనిలో జిల్లా నుంచి 6,500 ఎస్‌హెచ్‌జీల భాగస్వామ్యం ఉందని మెప్మా అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓఎన్‌డీసీ అమ్మకాలలో జిల్లా భాగస్వామ్యం పెద్ద మొత్తంలో పెరగాలని సూచించారు. మెప్మా జిల్లా లైవ్లీహుడ్స్ స్పెషలిస్ట్ సీహెచ్ నానిబాబు, జిల్లా ఐబి గ్రంధి పార్వతి, జిల్లా ఈ మార్కెట్ స్పెషలిస్ట్ సీహెచ్ మోహన్ వున్నారు.

భద్రాచలానికి పాదయాత్రగా భక్తులు

టి.నరసాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పురస్కరించుకుని సీతారాముల కల్యాణం తిలకించి తమ మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాదయాత్రగా తరలివెళ్లారు. మండలంలోని టి.నరసాపురం, మక్కినవారిగూడెం, తిరుమల దేవిపేట, మధ్యాహ్నపువారిగూడెం, వల్లంపట్ల, మల్లుకుంట, బొర్రంపాలెం, అప్పలరాజుగూడెం నుంచి బయలుదేరి వెళ్లారు. మార్గమధ్యలో భక్తులకు తాగునీరు, అల్పాహారం, భోజన వసతులు కల్పించారు. సుమారు 200 మంది భక్తులు పాల్గొన్నారు. అప్పలరాజుగూడెం ఆంజనేయస్వామి విగ్రహం వద్ద నుంచి పాదయాత్రను ప్రారంభించారు.



అప్పలరాజుగూడెం ఆంజనేయస్వామి విగ్రహం నుంచి పాదయాత్ర ప్రారంభిస్తున్న భక్తులు



వెంకటాపురంలో వరి సాగును పరిశీలిస్తున్న కేరళ రైతు బృందం

ప్రకృతి సాగుతో ప్రజారోగ్యం

సాగు విధానాన్ని పరిశీలించిన కేరళ రైతుల బృందం

పెదవేగి/ఏలూరు రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రకృతి విధానంలో సాగయ్యే పంట ఉత్పత్తులు దోహదపడతాయని ప్రకృతి సాగు రైతు ఉప్పలపాటి చక్రపాణి అన్నారు. పెదవేగి మండలం లక్ష్మీపురంలో ప్రకృతి విధానంలో సాగుచేస్తున్న పంటలను కేరళ రైతుల బృందం బుధవారం పరిశీలించి, పంటల సాగులో రైతులు చేపడుతున్న విధానాలు, యాజమాన్య పద్ధతులను తెలుసుకున్నారు. చక్రపాణి తోటలో ప్రకృతి విధానంలో సాగవుతున్న కొబ్బరి, పామాయిల్ తోటల్లో అంతరంగా పండిస్తున్న వక్క, మిరియం పంటలను పరిశీలించారు. ఎటువంటి రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా పంటలను సాగుచేస్తున్న విధానాన్ని నేరుగా చూపించారు. నాణ్యమైన పంటల దిగుబడితోపాటు ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ఈ విధానం దోహదపడుతుందని చక్రపాణి తెలిపారు. కేరళ రైతుల బృందం తొలుత వెంకటాపురం గ్రామంలో దేశీ విత్తనాలతో 16 ఎకరాల్లో సాగుచేసిన ఏ గ్రేడ్ వరి కాంపాక్ట్ బ్లాక్‌ను పరిశీలించారు. ప్రకృతి విధానంలో పొలం గట్లమీద వేసిన పంటలను గమనించిన బృందం రసాయనిక ఎరువులతో సాగుచేసిన పంటలను పరిశీలించి, రెండింటి మధ్య వ్యత్యాసాలను గమనించారు. జీవ ఉత్ప్రే రకాలు, కషాయాల తయారీ విధానాన్ని తిలకించి, ఎన్‌పీఎమ్ దుకాణాన్ని సందర్శించారు. అమ్మపాలెంలో ప్రకృతి వ్యవసాయం అవలంబిస్తున్న రైతులు, మెంటార్‌లు, రైతు శాస్త్రవేత్తలతో పరస్పరం చర్చించారు. రైతులు రంగయ్య, సత్తిబాబులకు చెందిన ఐదు అంతస్థుల నమూనా, కొబ్బరి ఏ గ్రేడ్ మోడల్‌పంటలను కేరళ రైతుల బృందం సందర్శించింది. రైతు సాధికార సంస్థ రీజనల్ కోఆర్డినేటర్ కృష్ణారావు, డీపీఎం తాతారావు, అదనపు డీపీఎం వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి సంధ్య, రైతులు పాల్గొన్నారు. ఏలూరు రూరల్ మండలం వెంకటాపురంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో కషాయాల తయారీపై వ్యవసాయ శాఖాధికారులు వివరించారు. 16 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసిన వరి పంటను సందర్శించారు.



కొబ్బరి సాగు వివరాలను చెప్తున్న రైతు చక్రపాణి

పిల్లలు నిలదీశారని తండ్రి ఆత్మహత్య



కొండయ్య

ముదినేపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం తాగుతూ రోజూ అర్ధరాత్రి ఇంటికి రావడాన్ని కన్నబిడ్డలు నిలదీయడంతో మనస్థాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ముదినేపల్లి మండలం వడాలిలో జరిగింది. జానకిగూడెంకు చెందిన పిచ్చేటి కొండయ్య(42)కు వడాలికి చెందిన గంగావేణితో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి 9వ తరగతి చదివే కుమారుడు, ఏడో తరగతి చదివే అమ్మాయి ఉంది. ఏడాది క్రితం భార్య సౌదీ వెళ్లి పనిచేస్తోంది. అప్పటి నుంచి కొండయ్య తన ఇద్దరు పిల్లలతో వడాలిలోని అత్తవారింట్లో ఉంటూ ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. కొండయ్య మద్యానికి బానిసగా మారి రోజూ మద్యం మత్తులో ఇంటికి వస్తున్నాడు. విసుగు చెందిన పిల్లలు తండ్రిని మందలించారు. మనస్థాపం చెందిన కొండయ్య మూడ్రోజుల క్రితం ఎలుకల మందు తినడంతో గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి ఎస్‌ఐ వి.ఎస్.వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మందలించిందని కొడుకు..

పెదవేగి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):పనిచేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడని, తల్లి మందలించడంతో మనస్థాపానికి గురై ఓ యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీపురం గ్రామానికి చెందిన దాసరి ఉపేంద్ర పని చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. ఎంతకాలం ఇలా తిరుగుతావని తల్లి మందలించడంతో పురుగు మందు తాగి ఉపేంద్ర(27) ఆత్మహత్య చేసుకున్నాడని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఒకరిది ఆర్థిక.. మరొకరిది అనారోగ్య సమస్యలతో..

పెదపాడు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పెదపాడు మండలం తోటగూడెం, సకలకొత్తపల్లి గ్రామాల్లో గడ్డి మందు తాగి ఇద్దరు మృతి చెందడంతో పెదపాడు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. తోటగూడెం గ్రామానికి చెందిన నార్ని సాంబశివరావు(42) ఆర్థిక ఇబ్బందులతో పాటుగా ఫిట్స్ ఉండటంతో గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

సకలకొత్తపల్లికి చెందిన సాకేటి సూర్యారావు (52) సెంట్రింగ్ సామన్లు అద్దెకు ఇస్తూ జీవనం సాగిస్తున్నాడు. అనారోగ్య సమస్యతో గడ్డిమందు తాగినట్టు భార్య నళినికుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్.ఐ. కట్టా శారద సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వేర్వేరుచోట్ల మరో ఇద్దరు బలవన్మరణం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):వేర్వేరు ఘటనల్లో పురుగు మందు తాగిన ఇద్దరు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. లక్ష్మీపురం గ్రామానికి చెందిన దాసరి ఉపేంద్ర (27) ఈ నెల 1న పురుగు మందు తాగడంతో ఆస్పత్రికి తీసుకొచ్చారు. పెనుగొండ మండలం గుడిపాడు గ్రామానికి చెందిన నేడునూరు లాజర్(52) ఈ నెల 1న పురుగుమందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురవడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. వీరిద్దరి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

వేసవిలో పర్యాటకులకు ప్రత్యేక రైలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : వేసవి దృష్ట్యా పర్యాటకుల కోసం ప్రత్యేక టూరిస్టు రైలును నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ఐఆర్‌సీటీసీ అధికారులు తెలిపారు. సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్ర ఈ నెల 8న ప్రారంభమై 19వ తేదీ వరకు జరుగుతుంది. ఉజ్జయినీ (మహాకాళేశ్వర్, ఓం కారేశ్వర్) ద్వారక(నాగేశ్వర్), సోమనాథ్, పూణే(భీమశంకర్), నాసిక్ (త్రియంబకేశ్వర్),ఔరంగాబాద్(గ్రీష్మేశ్వర్)లలో యాత్రలలో పుణ్య క్షేత్రాలను చూపించనున్నారు. ఒకొక్కరికీ 18వేల 510 రూపాయల ప్యాకేజీ ధర అన్నారు. హరిద్వార్, రిషికేష్, వైష్ణవిదేవి యాత్ర ఈ నెల 23 నుంచి మే 2వ తేదీ వరకు 9 రాత్రిళ్లు 10 పగళ్లు జరుగుతాయి. ఈ యాత్రలో హరిద్వార్, రిషికేష్, ఆనందపూర్, నయనాదేవి, అమృతసర్, మాతా వైష్ణవ్‌దేవి ఆలయాల సందర్శన ఉంటుందన్నారు. ఈ ప్యాకేజీ ద్వారా 18వేల 510 రూపాయలు ఒకొక్కరికి ధర ఉంటుందన్నారు. కాశీ, గయ, ప్రయోగ్, అయోధ్య యాత్ర (సరస్వతి పుష్కరాలు స్పెషల్ యాత్ర) మే 8వ తేదీ నుంచి మే 17వ తేదీ వరకు జరుగుతుందన్నారు. పూరీ, కోణార్క్, గయ, వారణాసి, అయోధ్య, ప్రయోగరాజ్‌లలోని దేవాలయాల దర్శనాలు ఉంటాయన్నారు. ఒకొక్కరికి 16వేల 800 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పంచ జ్యోతిర్లింగ యాత్ర జూన్ 4 నుంచి జూన్ 12 వరకూ నిర్వహించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. మహాకాళేశ్వర్, ఓం కారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీమ్‌శంకర్, గ్రీష్మేశ్వర్, ఎల్లోరా, మౌ, నాగపూర్ ప్రాంతాల్లోని ఆలయాల్లో దర్శనాలు ఉంటాయన్నారు. ఒకొక్కరికి 14 వేల 700 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ ప్యాకేజీలలో ప్రత్యేక రైలు, బస్సు హోటల్, భోజనం, సైడ్ సీయింగ్, గైడు సేవలు వంటివి కలిపే వసూలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ యాత్రకు వెళ్లాలనుకున్న వారు ఐఆర్‌టీసీ ఏరియా ఆఫీస్, విజయవాడ రైల్వే స్టేషన్ సెల్ నెంబర్ 92814 95848 లేదా 92810 30714 లో సంప్రదించాలని తెలిపారు.

చర్లపల్లి నుంచి విశాఖకు మరొకటి..

వేసవి దృష్ట్యా ప్రయాణికుల రద్దీని గుర్తించి ఈ నెల 3న రాత్రి 10.15 నిమిషాలకు చర్లపల్లిలో ప్రత్యేక రైలు (రైల్‌నెంబర్ 07011) బయల్దేరనుంది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, నడిపూడి, పిడుగురాళ్ల, సత్తెన పల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ స్టేషన్లలో ఆగనుంది. ఈ రైలులో సెకండ్ క్లాస్ ఏసీ, త్రి టైర్ ఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ రైలు నాల్గోవ తేదీ ఉదయం 9.30 గంటలకు విశాఖ చేరుతుందన్నారు.

భర్త అంత్యక్రియలను అడ్డుకున్న భార్య

హత్య చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు



శ్మశాన వాటిక వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : తన భర్తను భర్త తరపు బంధువులే చంపేశారంటూ తాడేపల్లిగూడెంలోని కొబ్బరితోట హిందూ శ్మశాన వాటిక వద్ద బుధవారం భార్య ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు శ్మశాన వాటిక వద్ద దహన సంస్కారాలను ఆమె అడ్డుకుంది. తాడేపల్లిగూడేనికి చెందిన కలగాని సతీశ్ బాబు మృతి చెందడంతో బంధువులు శ్మశాన వాటికకు తీసుకెళ్లారు. దీంతో భార్య స్వాతి తన భర్త మృతిపై అనుమానాలున్నాయంటూ దహన సంస్కారాలను అడ్డుకుంది. దీనిపై పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్.ఐ. బాదం శ్రీను ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. బాధితురాలు స్వాతి ఫిర్యాదుతో మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.సతీశ్ బాబు సోదరుడు శ్రీనివాస్ కలగజేసుకుని తన తమ్ముడు లివర్, కిడ్నీలు ఫెయిల్ అవడంతో చాలా కాలంగా చికిత్స చేయిస్తున్నామని, బుధవారం పరిస్థితి విషమించడంతో మృతి చెందాడని తెలిపారు.

ఉంగుటూరులో హత్యాయత్నం కేసు నమోదు

ఉంగుటూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):ఉంగుటూరులో మంగళవారం రాత్రి మార్లపూడి ప్రసాద్‌పై అదే గ్రామానికి చెందిన యర్రారపు రాజు పదునైన ఆయుధంతో దాడి చేశాడు. ఆస్పత్రిలో చికిత్స అనంతరం బుధవారం ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. వివాహేతర సంబంధమే ఈ ఘర్షణకు కారణమని తెలిసింది. గతంలో ఈ వ్యవహారంపై పెద్దల మధ్య రాజీ కుదిర్చారు. ఈ విషయమై మరోసారి ఘర్షణ జరిగినట్టు చేబ్రోలు ఎస్.ఐ. ఎం.సూర్యభగవాన్ తెలిపారు. ప్రసాద్ ఆరోగ్యం నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు.

ఇసుక ర్యాంపు దగ్గర వివాదం

పెదవేగి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):తమ్మిలేరు ఇసుక ర్యాంపు దగ్గర జరిగిన వివాదంలో ఒకరు గాయపడ్డాడు. పినకడిమికి చెందిన అబ్బూరి మహేశ్ మార్చి 29న తమ్మిలేరులో ఇసుక ర్యాం పులో పనికి వెళ్లాడు. నాగార్జున, నత్తా అజయ్ లు మహేశ్‌కు చెందిన పారలతో పనిచేస్తున్నా రు. వాటిని తిరిగి ఇవ్వమన్నందుకు అడిగిన మహేశ్‌పై నాగార్జున, అజయ్‌లు దాడి చేశారు. గాయపడ్డ మహేష్ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ చెప్పారు.

పాత కక్షలతో ఒకరిపై మరొకరు దాడి

ఏలూరు క్రైం : ఇద్దరు డ్రైవర్ల మధ్య పాతకక్షల నేపథ్యంలో ఒకరిపై ఒకరు దాడులకు తెగబడ్డారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లికి చెందిన గుడిపూడి ప్రకాశ్, చవాకుల సుధీర్ కుమార్‌లు డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఏం జరిగిందో తెలియదు కానీ సుధీర్‌కుమార్, ప్రకాశ్‌కు ఫోన్ చేసి ఎక్కడున్నావని అడిగాడు. తాను ఇంట్లోనే ఉన్నానని చెప్పడంతో సుధీర్ అతని ఇంటికి వెళ్లి దాడి చేశాడు. ప్రకాశ్ కూడా తిరిగి దాడి చేశాడు. దీంతో వీరిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

డ్రైన్‌లో మనిషి పుర్రె కలకలం

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలోని పాతూరులో డ్రైనేజీలో మనిషిపుర్రె కలకలం రేగింది. మున్సిపల్ సిబ్బంది సోమవారం డ్రెయిన్ పూడిక తీస్తుండగా మనిషి పుర్రె బయట పడింది. దీంతో సిబ్బంది ఆ పుర్రెను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. స్థానికులు ఆ విషయాన్ని వైరల్ చేయడంతో పోలీసులు బుధవారం ఆ ప్రాంతాన్ని పరి శీలించగా అక్కడ ఏమీ కనిపించలేదు. డ్రైనేజీ మట్టి తరలించిన డం పింగ్ యార్డుకు వెళ్లి వెతికినా ఆ పుర్రె కనిపించలేదు. స్థానికంగా క్రైస్తవ శ్మశాన వాటిక ఉండటంతో.. అక్కడ ఖననం చేసిన వారి పుర్రె డ్రైన్‌లో లభించి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా టీచర్ల సీనియార్టీ జాబితా విడుదల

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, మున్సిపల్, ఏలూరు నగరపాలక సంస్థ యాజమాన్యాల పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు సంబంధించి సవరించిన తాత్కాలిక సీనియార్టీ జాబితాలను డీఈవో వెంకట లక్ష్మమ్మ బుధవారం విడుదల చేశారు. ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ (టిస్) ఆధారంగా ఇప్పటికే రెండుదఫాలు రూపొందించిన సీనియార్టీ జాబితాలపై అభ్యంతరాలను స్వీకరించి, పరిష్కరించిన అనంతరం తాజాగా సవరణలతో కూడిన జాబితాలను మరోదఫా విడుదల చేశారు. ఎస్జీటీ కేడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్ కేడర్ పదోన్నతులకు, స్కూల్ అసిస్టెంట్ కేడర్ నుంచి గ్రేడ్-2 హెచ్‌ఎం పదోన్నతులకు సీనియార్టీ జాబితాలను తయారు చేశారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఈ జాబితాలను డీఈవో ఏలూరు వెబ్‌సైట్‌లో, పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లా విద్యాశాఖ కార్యాలయ(ఏలూరు) నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచామని డీఈవో వివరించారు. ఈ జాబితాలపై ఏవైనా అభ్యంతరాలుంటే ఈనెల 9వ తేదీలోగా సరైన ఆధారాలతో ఏలూరులోని డీఈవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు. సీనియార్టీ జాబితాలో తప్పిదం ఎక్కడుందో స్పష్టంగా తెలియజేయడంతో పాటు, సంబంధిత ఆధారాలు, అభ్యంతరం వ్యక్తం చేసే ఉపాధ్యాయుని పూర్తి వివరాలతో మాత్రమే తెలియజేయాలని కోరారు. ఫిర్యాదుల పరిష్కార కమిటీ అభ్యంతరాలను పరిశీలించి తుదినిర్ణయం తీసుకుని, సంబంధిత ఫిర్యాదుదారునికి తెలియజేయడం జరుగుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 11,386 మంది ఉపాధ్యాయులు /హెచ్‌ఎంలు పనిచేస్తుండగా, వీరిలో 5532 మంది స్కూల్ అసిస్టెంట్లు, 4800మంది ఎస్జీటీలు, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు 350మంది, మరికొందరు ఇతర కేడర్ల టీచర్లు ఉన్న విషయం విదితమే.

ఉగాది పండుగకు ఇంటికొచ్చి.. తిరిగిరాని లోకాలకు

నరసాపురం రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగకు ఇంటికొచ్చిన కొడుకు తిరిగిరాని లోకానికి వెళ్లిపోవడంతో ఆ తండ్రి కన్నీరు మున్నీరయ్యాడు. చేతికొచ్చిన కొడుకు ఇలా నిర్జీవంగా మారడంతో గుండెలవిసేలా రోదిస్తున్నారు. నరసాపురం మండలం చిట్టవరం గ్రామానికి చెందిన కట్టా నవరత్నం(25) హైద్రాబాద్‌లో పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. ఉగాది పండుగకు కుటుంబ సభ్యులతో గడుపుదామని ఇంటికి వచ్చాడు. పండుగ అయిపోవడంతో బుధవారం తిరిగి హైద్రాబాద్ వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఈక్రమంలో నరసాపురం- పాలకొల్లు జాతీయ రహదారి వద్ద చిట్టవరం సమీపంలో రోడ్డు పక్కకు ఆగి ఉన్న బైక్‌ను నరసాపురం నుంచి పాలకొల్లు వెళ్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో నవరత్నం తీవ్రంగా గాయపడగా వెంటనే ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను మృతి చెందినట్టు నిర్ధారించారు. మరో వ్యక్తికి స్వల్ప గాయాలవడంతో ప్రైవేట్ అస్పత్రికి తరలించారు.. తండ్రి పెద్దిరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్.ఐ. వెంకట సురేశ్ తెలిపారు.

కాల్వలో ట్రాక్టర్ బోల్తా



ఆచంట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : ఆచంట మండలం కోడేరు బ్యాంక్ కెనాల్‌లో బుధవారం ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలయ్యాయి. కోడేరు రేవు వద్ద లాకుల సమీపంలో ఏటిగట్టు వద్ద కొన్నేళ్ల నుంచి నిద్రగన్నేరు చెట్టు కెనాల్ లాకుకు ఇబ్బందిగా ఉండటంతో ఈ చెట్టును బుధవారం తొలగించే కార్యక్రమం చేపట్టారు. అయితే తొలగించిన కొమ్మలు వాటిని ట్రాక్టర్ సాయంతో తీసుకెళ్లే సమయంలో వంతెనపై వస్తుండగా ప్రమాదవశాత్తు కర్రల లోడుతో ఉన్న ట్రాక్టర్ బ్యాంక్ కెనాల్లోకి పడిపోయింది. దీంతో స్థానికులు వెంటనే స్పందించి డ్రైవర్‌ను బయటకు తీసుకొచ్చారు. డ్రైవర్‌కు తీవ్రగాయాలవగా వెంటనే 108 వాహనంలో పాలకొల్లు తరలించారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. లాకుల వద్ద గత కొన్నేళ్లుగా నిద్రగన్నేరు చెట్టు అడ్డుగా ఉండటంతో కమిటీ సభ్యుల తీర్మానం మేరకు చెట్టు, చెట్టుకొమ్మలు తొలగించే కార్యక్రమం చేపట్టినట్టు ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

తణుకులో ఐటీ అధికారుల దాడులు

తణుకు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):తణుకులో రెండు రోజులుగా రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాలపై ఐటీ అధికారులు సోదాలు చేపట్టారు. ఐటీ అధికారుల దాడుల విషయం బుధవారం వెలుగులోకి వచ్చింది. పట్టణానికి చెందిన రియల్టర్ కాటూరి లక్ష్మణరావు, వేల్పూరుకు చెందిన నున్నా దుర్గాప్రసాద్ ఇళ్లు, కార్యాలయాలపై ఏకకాలంలో అధికారులు దాడులు చేసినట్టు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వంలోని తణుకు మున్సిపల్ పరిధిలోని టీడీఆర్ కుంభకోణంలో కీలకంగా వ్యవహరించారనే ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలో ఐటీ అధికారులు దాడులు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇరువురి నివాసాలు, కార్యాలయాలపై ఏకకాలంలో దాడులు చేసి కీలకపత్రాలు స్వాధీనం చేసుకున్నారు. టీడీఆర్ కుంభకోణంలో అప్పటి మున్సిపల్ కమిషనర్‌తోపాటు మరో ముగ్గురు అధికారులపై వేటు వేసిన విషయం విదితమే. ఇప్పటికే ప్రభుత్వం టీడీఆర్ కుంభకోణంలో వాస్తవాలను తేల్చేందుకు సీబీఐ, ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఇపుడు ఐటీ దాడులు ప్రాధాన్యం సంచరించుకుంది.

పీఆర్ ఇంజనీరింగ్ అధికారులతో జడ్పీ చైర్ పర్సన్ సమీక్ష

ఏలూరుసిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జడ్పీ కార్యాలయంలో బుధవారం ఉమ్మడి జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జడ్పీ నుంచి మంజూరు చేసిన పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ కె.భీమేశ్వర్, దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాల పంచాయతీరాజ్ డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తాం : ఎంపీడీవో

లింగపాలెం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): చంద్రన్న స్వయం ఉపాధి పథకం ద్వారా రుణాలు పొందేందుకు లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులను బ్యాంకర్లతో కలిసి ఎంపీడీవో కందుల వాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల శ్రేయస్సే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. దరఖాస్తులను గురువారం కూడా పరిశీలించనున్నట్టు తెలిపారు. వివిధ కార్పొరేషన్‌ల ద్వారా ఉప్పటి వరకు 708 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారని వీటిని పరిశీలించి అర్హులకు సబ్సిడీ లోన్లను మంజూరు చేస్తామన్నారు.

ఇంటర్వ్యూల్లో 56 మంది విద్యార్థుల ఎంపిక

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : విశాఖ దివీస్ ల్యాబ్స్‌లో ఎగ్జిక్యూటివ్ ట్రైనీ ఉద్యోగాలకు బుధవారం సీఆర్ఆర్ పీజీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. సంస్థ ప్రతినిధి(హెచ్ఆర్) రాజేష్ మాట్లాడుతూ తాము నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 56మందిని ఎంపిక చేశామని, వీరంతా కాకినాడ, విశాఖ, హైదరాబాద్ బ్రాంచ్‌లలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు, డైరెక్టర్ యలమర్తి బాబు, ప్రిన్సిపాల్ రామరాజు, ఎంబీఏ ప్రొఫెసర్ టి.రాజేశ్ పాల్గొన్నారు.

గణిజర్ల-వెంకటాపురం బస్సు సర్వీసు పునరుద్ధరించాలి

చింతలపూడి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : చింతలపూడి నుంచి కాంతంపాలెం మీదుగా వెంకటాపురం-వెంకటాద్రిగూడెం-గణిజర్లకు బస్సు సర్వీసు నడపాలని సీపీఐ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మార్గంలోని విద్యార్థులు పాఠశాలలకు అటు సత్తుపల్లి వెళ్లాలన్నా, ఇటు చింతలపూడి రావాలన్నా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గతంలో ఇక్కడ సర్వీసులు నడిచేవని, వాటిని రద్దు చేసి పది సంవత్సరాలకుపైగా అయ్యిందని, రోడ్డు బాగానే ఉన్నప్పటికీ సర్వీసులు నడపడంలేదన్నారు. ప్రజల కోసం ఈ సర్వీసులను పునరుద్ధరించాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌కు విజ్ఞప్తులు అందచేసినట్టు సీపీఐ నాయకులు ఎం.వసంతరావు, టి.బాబు తెలిపారు.

అంజుమన్ నూతన కార్యవర్గం ఏర్పాటు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : అంజుమన్ సంస్థలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు సంస్థ నూతన వర్కింగ్ కమిటీ కార్యవర్గ సభ్యుడు రియాజ్ అలీఖాన్ తెలిపారు. బుధవారం అంజుమన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బైలా ప్రకారం సమావేశం ఏర్పాటు చేసి అధ్యక్షునిగా సులేమాన్‌ను, కార్యదర్శి అమీర్‌జాన్‌ను తొలగిస్తూ నూతన కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నూతన అధ్యక్షునిగా ఎం.డి. జబీవుల్లాసాహెబ్, వ్యవహారాల అధ్యక్షులుగా రాజా అహ్మద్, ఇలియాస్ పాషా, కార్యదర్శిగా అహ్మదుల్లా షరీఫ్, ట్రెజరర్‌గా షేక్ సిరాజ్‌బాషా, ఆర్గనైజర్ ప్రచార కార్యదర్శిగా ఎం.డి.ఇక్బాల్, ఆర్గనైజ్ కార్యదర్శిగా అస్లాం ఆలీపాషా, ఉపాధ్యక్షులుగా ఎం.డి.సిద్దిక్ ఆలీ, ఎం.డి.అనీష్ పాషా, షేక్ కాజాబాబు, ఎం.డి.అక్బాల్, ఎం.డి.ఫైజుల్లా, షేక్ కరీముల్లాను ఎన్నుకున్నారు.

పెండింగ్ జీతాల విడుదలపై లస్కర్ల హర్షం

ఏలూరురూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఇరిగేషన్ శాఖలో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న లస్కర్లకు తొమ్మిది నెలల బకాయిల జీతాలు విడుదల చేశారు. దీంతో బుధవారం విజయవాడలో జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు కె.శివారెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఇరిగేషన్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆర్.సి.హెచ్.కృష్ణారెడ్డి, పి.రమేశ్, ఎం.సరస్వతి, ఆర్.ఎస్.హరనాథ్ పాల్గొన్నారు.

సాగులో మార్పులపై సమన్వయ సమావేశం

ఏలూరురూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : మార్టేరు సహ సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ అధ్యక్షతన ఏలూరు ఏరువాక కేంద్రంలో సమన్వయ సమావేశం జరిగింది. ఆచార్య ఎన్.జి.రంగ విశ్వ విద్యాలయం విస్తరణ సంచాలకులు జి.శివనారాయణ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న శాస్త్ర సాంకేతికతను అందిపుచ్చుకుని సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో టి.శ్రీనివాస్, వ్యవ సాయ శాఖ జెడి షేక్ బాషా, శాస్త్రవే త్తలు శ్రీనివాస్, కె.మోహన్‌రావు, ఎన్. నాగేంద్రబాబు, ఏడీఏ లలిత పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ సొంతిళ్లు: ఎమ్మెల్యే చంటి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఏలూరు రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన పేదలందరికీ సొంతింటి కల సాకారానికి చేస్తామని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో మంజూరైన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసే బాధ్యత తమదేనని స్పష్టం చేశారు. బుధవారం ముస్లిం షాదీఖానాలో డ్వాక్రా గ్రూపుల సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టిడ్కో ఇళ్ళ కోసం 35 వేలు డీడీలు కట్టిన వారిలో 2 వేల 200 మందికి ఇళ్ళు మంజూరయ్యాయని, మిగిలిన వారికి 35 వేలు వెనక్కి ఇస్తామని తెలిపారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ ఎం.పార్థ సారథి, డిప్యూటీ మేయర్ ఉమామహేశ్వరరావు, మెప్మా సిఎంఎం ఝాన్సీరాణి పాల్గొన్నారు.

విజయవాడ తరలివెళ్లిన టీడీపీ నాయకులు

దెందులూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : దెందులూరు గ్రామానికి చెందిన టీడీపీ యువ నేత, విద్యార్థి విభాగం టీఎన్ఎస్ఎఫ్ జిలా అధ్యక్షుడిగా పని చేస్తున్న పెనుబోయిన మహేష్ యాదవ్‌ను ఏపీ యాదవ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. దీంతో విజయవాడలోని కళాక్షేత్రంలో ప్రమాణా స్వీకారానికి దెందులూరు మండలంతో పాటు నియోజకవర్గం నుండి పెనుబోయిన మహేష్ యాదవ్‌తో పాటుగా 100 కార్లలో ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, వీరమచినేని ప్రభాకర్, మాగంటి నారాయణ ప్రసాద్, గారపాటి కొండయ్యచౌదరి, ఇప్పిలి వెంకటేశ్వరావుతో పాటు పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు తరలి వెళ్లారు.

అఖిల భారత మహాసభలకు రవి పయనం

ఏలూరుకార్పొరేషన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : ఐదు రోజుల పాటు తమిళనాడు రాష్ట్రంలోని మధురై పట్టణంలో జరిగే 24వ సీపీఎం అఖిల భారత మహాసభలకు బుధవారం సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి అనుచర బృందంతో పయనమయ్యారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ వద్ద ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న రాజకీయ విధానాన్ని సమీక్షించుకునేందుకు రాబోయే మూడేళ్లలో నిర్ణయించుకోవాల్సిన రాజకీయ విధానం గురించి స్వతంత్రంగా సీపీఎం ఎదుగుదల గురించి ఈ మహాసభల్లో చర్చించి కర్తవ్యాలు, కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని చెప్పారు.

అభయాంజనేయునికి వీర్రాజు పూజలు


ఆశీర్వచనాలు అందుకుంటున్న వీర్రాజు

పెదపాడు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు బుధవారం ఉదయం అప్పనవీడులోని అభయాంజనేయ స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసేందుకు రాజమండ్రి నుంచి అమరావతి వెళ్తూ మార్గమధ్యలో అభయాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. సోము వీర్రాజుకు ఆలయ అర్చకులు, దేవాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి, పూజల అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సౌభాగ్యలక్ష్మి ఆలయానికి శుభ మండపం బహూకరణ

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : సత్రంపాడులోని సౌభాగ్య లక్ష్మీదేవి ఆలయం వద్ద వ్రతాలు, పూజలు జరుపుకునేందుకు వీలుగా దాతలు శుభ మండపాన్ని తయారు చేయించి అందజేశారు. సత్రంపాడు గ్రామానికి చెందిన మునునూరి ధన కోటేశ్వరరావు-కృష్ణకుమారి దంపతులు శుభ మండపాన్ని తయారు చేయించి ఆలయ ధర్మకర్తలకు బుధవారం అందజేశారు. ఈ శుభ మండపంలో సౌభాగ్యలక్ష్మీ అమ్మవారిని ఏర్పాటు చేసి మేళతాళాలతో ఊరేగింపు జరిపారు. శుభ మండపాన్ని అందచేసిన కోటేశ్వరరావు దంపతులను ఆలయ చైర్మన్ కె.జి.ఎస్.వి.గోపాలకృష్ణ, పోతురాజు, శ్రీనివాసరావు, చినబాబు, ప్రవీణ్, మిత్రబృందం ఆలయ మర్యాదలతో సత్కరించారు.

లక్ష్మీగణపతి స్వామికి చందనంతో అలంకారం

ఏలూరుకార్పొరేషన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : విశ్వావసు నామ సంవత్సరంలోని తొలి బుధవారం కావడంతో సత్రంపాడులోని లక్ష్మీగణపతిస్వామి ఆలయంలో స్వామిని చందనంతో అలంకారం జరిపి భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు చందన గణపతిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని గరికతో అర్చన జరిపి బెల్లం నివేదనలు సమర్పించి గణేష్ నామ స్తోత్రాలను పఠించారు. ఆలయ అర్చకులు రెండుచింతల రాఘవేంద్రశర్మ భక్తుల గోత్రనామాలతో అర్చనలు జరిపారు.

ఆకతాయిల ఆట కట్టించండి!

పోలీసులకు విద్యార్థినుల తల్లిదండ్రుల విజ్ఞప్తి



పోలవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పోలవరంలో ఆకతాయిల అల్లరి మరింత పెరిగింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల రోడ్డు ఆవరణలో బైక్ విన్యాసాలతో చెలరేగిపోతున్నారు. విద్యార్థినులపై కామెంట్లు చేస్తూ టీజింగ్‌కు పాల్పడుతున్నారు. ఎదురు తిరిగితే ఎక్కడ లేనిపోని గొడవలు అవుతాయేమోనని విద్యార్థినులు మౌనంగా ఉండిపోతున్నారు. ఇదే అలుసుగా తీసుకుని ఆకతాయిలు మరింత చెలరేగిపోతున్నారు. విద్యార్థినులు విద్యాలయాలకు వెళ్లే సమయంలో, తిరిగి బయటకు వచ్చే సమయంలో వీరి బెడద మరింత ఎక్కువవుతోంది. ఆకతాయిల విన్యాసాలతో మరింత భయాందోళనకు మరింత భయాందోళన చెందాల్సి వస్తోందని, గతంలో కొంతమంది గాయపడిన సందర్భాలూ ఉన్నాయనే ఆరోపణలొస్తున్నాయి. పోలీసులు ఆకతాయిలకు కౌన్సెలింగ్ ఇచ్చి వారి బెడద లేకుండా చేయాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి : కలెక్టర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ఏలూరుసిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వేసవిలో ఎక్కడైనా తాగునీటి సమస్య ఏర్పడితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి హెచ్చరించారు. జిల్లాలో తాగునీటి సరఫరాపై కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం జిల్లాలోని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, జిల్లా పరిషత్ సీఈవో, డీపీవో, ఎంపీడీవోలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీటి సమస్యలపై పత్రికల్లో ప్రచురించిన వార్తాంశాలపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్మించిన తాగునీటి సౌకర్యం, టాయిలెట్‌లను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు.అంతేగాక 392 అంగన్‌వాడీ కేంద్రాలకు వర్షపు నీరు పరిరక్షణ నిర్మాణాలను మంజూరు చేశామని, వాటిలో 294 పనులు పూర్తయ్యాయని,సదరు పనులకు సంబంధించి బిల్లులను వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ త్రినాథ్‌బాబు, ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ ఈఈలు, డిఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలి

ఏలూరు : జిల్లాలో పేదలకు నిర్మిస్తున్న గృహాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లాలోని హౌసింగ్,ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఇళ్ల నిర్మాణ పురోగతిపై బుధవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మే 31 నాటికి జిల్లా వ్యాప్తంగా 13వేల 525 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని, లక్ష్యానికి అనుగుణంగా ఇంత వరకు కేవలం 6వేల832 ఇళ్ల నిర్మాణం మాత్రమే పూర్తయ్యాయన్నారు. ప్రస్తుత వేసవిలో ఇళ్ల నిర్మాణానికి అనుకూలమైన వాతావరణం ఉంటుందని, ఇంజనీరింగ్ సిబ్బంది వారికి కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత సమయంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ జి.సత్యనారాయణ, ఈఈలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత


చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 44మందికి రూ.36లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందించారు. అలాగే 15మంది డ్వాక్రా మహిళలకు రూ.15 లక్షల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన బాధితులకోసం సీఎం సహాయనిధిద్వారా రూ.36 లక్షలను మంజూరు చేయించామన్నారు. పేదలకు టీడీపీతోనే న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దెందులూరు ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, పార్టీ నాయకులు ఉప్పలపాటి శ్రీరామ్‌ప్రసాద్, బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు కసరత్తు


అధికారులకు సూచనలిస్తున్న రఘురామ

ఉంగుటూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : చేబ్రోలు-ఉండి రహదారిలో రాచూరు శివాలయం మలుపులో రోడ్డు ప్రమాదాల నివారణకు శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు బుధవారం సా యంత్రం ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదాల నివారణపై పలు శాఖల అధికార్లతో చర్చించి తగిన విధంగా రహదారి వెడల్పు చేయాలని రఘురామకృష్ణంరాజు కోరారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

చింతలపూడి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఐసిడిఎస్ పరిధిలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త ఒకటి, అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులు మూడు ఖాళీగా ఉన్నాయని, వాటికి దరఖాస్తులు చేసుకోవాలని ఐసిడిఎస్ పిఓ పి.మాధవి తెలిపారు. స్థానికులైన వివాహిత మహిళలు ఈ ఏడాది జూలై 1వ తేదీ నాటికి 21 నుండి 35 సంవత్సరాలలోపు వయస్సు కలిగి, కనీస విద్యార్హత పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఇతర వివరాల కోసం ప్రాజెక్టు కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు.

● బుట్టాయగూడెం : బుట్టాయగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో తులసీ తెలిపారు.ఈ నెల 3 నుంచి 17వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. దరఖాస్తు కవరుపై ఏ పోస్టుకు అర్జీ పెడుతున్నా రో స్పష్టంగా రాయాలని, 21-35 ఏళ్ల మధ్య ఉన్న స్థానిక మహిళలే అర్హులని, టెన్త్ ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని తెలియజేశారు.

●ఉంగుటూరు : మండలంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని భీమడోలు సీడీపీవో. కార్యాలయం ఒక ప్రకటనలో కోరింది. ఈ నెల 17వ తేదీ లోపు భీమడోలు సీడీపీవో. కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు.

●జంగారెడ్డిగూడెం : పట్టణం 73వ కోడ్ నెంబర్‌లో ఒక ఖాళీ ఉందని, అలాగే మండలంలోని గురవాయిగూడెం 94వ కోడ్ నెంబర్‌లో ఓపెన్ కేటగిరి మహిళ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సహాకురాలు పోస్టుకు జంగారెడ్డిగూడెంలోని 77వ కోడ్ నెంబర్‌కు ఎస్టీ, సుబ్బంపేట 81వ కోడ్‌లో బీసీ-బీ మహిళ, పట్టెన్నపాలెంలోని 69వ కోడ్ నెంబర్‌లో ఓపెన్ కేటగిరికి చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని అర్హులైన మహిళలకు సూచించారు.

సమస్యలపై అర్జీల స్వీకరణ


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్

చింతలపూడి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆర్అండ్‌బి బంగ్లా ఆవరణలో బుధవారం అధికారుల సమక్షంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రోడ్లు, ఇళ్ళు, ఇళ్ళ స్థలాలు, వ్యక్తిగత సమస్యలపై దరఖాస్తులు జోరుగా వచ్చాయి. పార్టీ ఆదేశాలతో ప్రతీ బుధవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఒక్కొక్క మండలంలో ప్రజా వేదికల ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించాలన్న ఆదేశాలతో ఈ రోజు చింతలపూడిలో ఏర్పాటు చేశారు. అధికారులతో కొన్నింటిని అక్కడే మాట్లాడి సమస్యలు పరిష్కరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రమద్వర, మునిసిపల్ కమిషనర్ పావని, తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం : అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలో కె.గోకవరంలో ప్రజలతో ముఖాముఖీ నిర్వహించారు. గ్రామాల్లో సాధికార కమిటీల ద్వారా ప్రజలకు చేరువయ్యేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పి4 కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

తప్పులు సరిచేసి మళ్లీ సర్వే చేయండి


వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో మండలంలోని గుండుగొలనుకుంట, వెంకటకృష్ణాపురం గ్రామాల్లో జరిపిన సర్వేలో తప్పులు సరి చేయాలంటూ రైతులు ఆందోళన బాట పట్టారు. ఆయా గ్రామాల రైతులు తహసీల్దారు కార్యాలయం ముందు బుధవారం ఆందోళనకు దిగారు. అనంతరం తహసీల్దారు జె.వి.సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం రైతులు చిలుకూరి సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడుతూ తమ రైతులెవరికీ తెలియకుండా అప్పటి ప్రభుత్వం రీసర్వే జరిపిందన్నారు. ఈ గ్రామాల్లో రెండు సార్లు రెవిన్యూ సదస్సులు జరిగినా సమస్య పరిష్కారం కాలేదన్నారు.ప్రస్తుత ప్రభుత్వం పాత సర్వేని రద్దు చేసి తిరిగి రీసర్వే జరపాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, మాజీ సర్పంచ్ వీరంకి వెంకన్న బాబు, మటపర్తి బద్రి, రైతులు పాల్గొన్నారు.

సమస్యలపై అర్జీల అందజేత


సమస్యలపై అర్జీ అందజేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : వెలుతురువారిగూడెం - రెడ్డిగణపవరం గ్రామాల మధ్య అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డును పూర్తి చేయాలంటూ నియోజకవర్గ స్థాయి గ్రీవెన్స్‌లో ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులుకు ప్రజలు వినతిపత్రం అందజేశారు. అలాగే వెలుతురువారిగూడెం గ్రామం మధ్యలో ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను ఊరి శివారులకు తరలించాలని పీడీఎస్‌యూ నాయకులు ఇ.భూషణం, బి.వినోద్, బి.శ్యాంబాబు వినతిపత్రాలు అందజేశారు. అలాగే మంచినీరు, డ్రైన్లు, రోడ్ల సమస్యలు పరిష్కరించాలని చైర్మన్‌కు వినతులు అందజేశారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చైర్మన్ శ్రీనివాసులు హామీ ఇచ్చారు.


నోట్, పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి

బుట్టాయగూడెం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయిబాబా అన్నారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర మండలి పథకంలో భాగంగా విద్యార్థులకు నోట్, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఏప్రిల్ 7 నుంచి మొదటి సంవత్సరం ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభమవుతాయని, ఇందులో భాగంగానే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్నట్టు ప్రిన్సిపాల్ సంజీవని కుసుమ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

జడ్పీ చైర్మన్ సచివాలయ ఆకస్మిక తనిఖీ

పెదపాడు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ పెదపాడు మండలం సత్యవోలులోని గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయానికి సంబంధించిన హాజరు పట్టి, రికార్డులను తనిఖీ చేశారు. ఆఫీసు వేళల్లో ఉండాల్సి సిబ్బంది లేకపోవడంతో వారి ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారికి మెమోలు జారీ చేయాలని తహసీల్దార్‌కు సూచించారు.

వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలి

ఏలూరురూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : పీఆర్సీ గడువు ముగిసి 21 నెలలు అయినా పన్నెండవ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయకపోవడం పట్ల ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. తక్షణం వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసి 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

పోలసానిపల్లిలో చలివేంద్రం ప్రారంభం

భీమడోలు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : పోలసానపల్లిలో దివ్యాంగుల సంక్షేమం కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు సర్పంచ్ రహీమాబేగమ్ ప్రారంభించారు. భీమడోలు రామకృష్ణ, ఉండి పెద్దిరాజు, బెంజిమన్, భీమడోలు జ్యోతిశ్రీ, కనుమూరి బాపిరాజు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ఏలూరు క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినీ విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని ఏమాత్రం ఆదమర్చి యాండ్రాయిడ్ ఫోన్లలో వచ్చే లింకులను నొక్కితే నష్టపోవాల్సి వస్తుందని జాగ్రత్తగా ఉండాలని ఏలూరు జిల్లా సైబర్ సెల్ మహిళా ఎస్ఐ ఎస్వి పద్మ అన్నారు. ఏలూరు సమీపంలోని సత్రంపాడు ఐటీఐ కాలేజీలో విద్యార్థులకు సైబర్ నేరాలపై ప్రత్యేక సదస్సు ద్వారా అవగాహన కల్పించారు.

నేటి నుంచి రెండో విడత గ్రామ సభలు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : సెకండ్ ఫేజ్ రీ సర్వే ఏప్రిల్ మూడో తేదీ నుంచి ప్రారంభం కానున్నట్టు తహసీల్దార్ కె.స్లీవజోజి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని గురవాయిగూడెం గ్రామానికి సంబంధించి ఆ గ్రామ సచివాలయం వద్ద, పన్నెండు గంటలకు మాతన్నగూడెం గ్రామానికి సంబంధించి చక్రదేవరపల్లి గ్రామ పంచాయితీ వద్ద రైతులకు, గ్రామ పెద్దలకు గ్రామసభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు

ఉంగుటూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని, ఇందులో భాగంగా ఆయా గ్రామాలలో డ్రైన్లు నిర్మాణం చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. బుధవారం మండలంలోని కాకర్లమూడి, వి.ఏ.పురం, దొంతవరం,రాచూరు, సీతారాంపురం గ్రామాల్లో నిర్మించిన సి.సి.రహదారులను ఆయన ప్రారంభించి శిలా ఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం : గన్ని


చంద్రబాబుతో గన్ని వీరాంజనేయులు

భీమడోలు, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి) :టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని సమస్యలుంటే తన దృష్టికి తీసుకు రావాలని ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అన్నారు. గన్ని క్యాంపు కార్యాల యంలో బుధవారం రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు నియో జకవర్గంలోని పార్టీ క్యాడర్‌తో సమావేశం నిర్వహించారు. అనంతరం వెలగపూడి వెళ్లి సీఎం చంద్రబాబును కలిసి సమస్యలపై విన్నవించారు. జిల్లాలోని పలు సమస్యలను ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

దోసపాడులో గంగానమ్మ జాతర

దెందులూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : దోసపాడు గ్రామ దేవత గంగనమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. తెల్లవారు జాము నుంచే ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ ప్రతాప్ శ్రీరామ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా పుప్పాల కాశీ విశ్వనాథం - అమ్మాజీ దంపతులు, కొత్తపల్లి ప్రశాంత్ కుమార్, మౌనిక దంపతులు గంగనమ్మకు పుట్టింటి పట్టు చీరను సమర్పించారు. శ్రీకృష్ణ కమిటీ, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్మించిన భోజనశాలలను గురువారం ప్రారంభించనున్నారని ఆలయ కమిటీ తెలిపింది.

చలివేంద్రం ప్రారంభం

పోలవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : తహసీల్దారు కార్యాలయం వద్ద బుధవారం తహసీల్దారు సాయిరాజు ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. కార్యాలయానికి పనుల నిమిత్తం వచ్చే వారి దాహార్తిని తీర్చాలనే ఉద్దేశంతో ఈ చలివేంద్రం ప్రారంభించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లో అవసరాన్ని బట్టి చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. చలివేంద్రాల నిర్వహణ బాధ్యత ఆయా గ్రామాల వీఆర్ఏలకు అప్పగించనున్నట్టు తెలిపారు.

56 శాతం ఆస్తి పన్ను వసూలు

చింతలపూడి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీలో ఆస్తి పన్ను మార్చి 31 నాటికి 56 శాతం వసూలైందని, వాటర్ టాక్స్ 26 శాతం వసూలైందని నగర పంచాయతీ కమిషనర్ డి.పావని తెలిపారు. ఆస్తి పన్ను 7 వేల 272 మందికిగాను పెండింగ్ కలిపి 2024-25 సంవత్సరంలో 2 కోట్ల 82 లక్షలు వసూలు కావాల్సి ఉండగా వడ్డీ రాయితీ 50 శాతం ఇచ్చినా కోటి 36 లక్షలు మాత్రమే వసూలైందన్నారు.

ఈఎండీపీ జిల్లా ఎక్స్‌పో విజేతలకు బహుమతులు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : సమగ్రశిక్ష, ఎస్సీఈఆర్టీ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని 40 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహిస్తోన్న మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం(ఈఎండీపీ)లో భాగంగా బుధవారం స్థానిక సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూల్లో జిల్లా స్థాయి ఎక్స్‌పో నిర్వహించారు. నూతన ఆవిష్కరణలపై నిర్వహించిన ప్రదర్శనలో విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టుల నుంచి ఉత్తమమైనవాటిని ఎంపిక చేసి సంబంధిత విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లను అందజేశారు.

రవాణా శాఖ మంత్రితో రెడ్డి అప్పలనాయుడు భేటీ

ఏలూరు రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రవాణా శాఖా మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డిని అమరావతి సచివాలయంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఆర్టీసి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ భేటీలో ఆర్టీసి నెల్లూరు జోనల్ చైర్మన్ సురేశ్ రెడ్డి, కడప జోనల్ చైర్మన్ కోలా నాగరాజు ఉన్నారు.

రీసర్వేకు సహకరించండి

కామవరపుకోట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా కామవరపుకోట ప్రాంతంలోని తూర్పుయడవల్లి గ్రామాన్ని ఎంపిక చేసిందని, రీసర్వే పనులు ప్రారంభిస్తామని రైతులు, గ్రామస్తులంతా సహకరించాలని జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం.వి. రమణ పిలుపునిచ్చారు. బుధవారం గ్రామంలో రీసర్వే టీమ్ ర్యాలీ నిర్వహించింది. అనంతరం ఏర్పాటు చేసిన ఈ సభకు గ్రామ సర్పంచ్ వందనాల అనిత అధ్యక్షత వహించారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ

లింగపాలెం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై విచారణ చేపట్టి కుటుంబానికి న్యాయం చేయాలని లింగపాలెం మండలంలో యునైటెడ్ పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు క్రైస్తవ పాస్టర్‌లు మాట్లాడుతూ ప్రవీణ్‌ది రోడ్డుప్రమాదం కాదని అన్నారు. రాష్ట్రంలో క్రైస్తవ సంఘాలకు రక్షణ కల్పించాలని ప్రవీణ్ పగడాల మృతిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని ఆయన మరణంపై క్రైస్తవ సమాజాలకు ఉన్న అనుమానాలను నివృత్తి చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

రైతుల పక్షాన పోరాడుతాం

పోలవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : ప్రాజెక్టు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రజలు రైతాంగం పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రాజెక్టు అధ్యయన కమిటీ వైస్ చైర్మన్ కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం పోలవరం ప్రాజెక్టులో పలు నిర్మాణ ప్రాంతాలను పరిశీలించిన అధ్యయన బృందం ప్రాజెక్టు ముఖద్వారం వద్ద జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడింది. సమస్యల నుంచి కేంద్ర ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తోందని, తాము ప్రజలు, రైతాంగం పక్షాన పోరాడుతున్నట్టు తెలిపారు. అధ్యయన కమిటీ మెంబరు రాజనాల రామ్మోహనరావు మాట్లాడుతూ గతంలో షర్మిలా రెడ్డి నిర్వాసితుల గ్రామాల్లో పర్యటించారని, నేడు షర్మిలా రెడ్డి ఆదేశాల మేరకే తాము వచ్చామన్నారు.

ప్రాజెక్టును పూర్తి చేయండి

ప్రచార జాతాలో సీపీఐ డిమాండ్

కుక్కునూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం కుంటి సాకులు మాని త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ ప్రచార జాతా కార్యక్రమంలో భాగంగా బుధవారం కుక్కునూరు మండలంలోని సీతారామనగరం, ఉప్పేరు, చీరవల్లి గ్రామాల్లో నిర్వహించిన సభల్లో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు ఏ మేరకు నిర్మించాలి అన్న విషయంలో అయోమయం సృష్టిస్తున్నారని, మొదట ఇచ్చిన హామీ మేరకు 45.72 కాంటూరు ఎత్తులోనే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కుక్కునూరు మండల సమితి కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కారందాలయ్య, సన్నేపల్లి సాయిబాబు, బాడిస రాము, జిల్లా సమితి సభ్యులు ఐతా సురేష్ బాబు, కొన్నే లక్ష్మయ్య, కూరాకుల బాబూరావు వరకా శ్యామల పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న గౌడ్, లచ్చన్న విగ్రహాల ఆవిష్కరణ



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ముదినేపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గురజ రోడ్డు సెంటర్‌లో ఏర్పాటుచేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాలను బుధవారం ఆవిష్కరించారు. విగ్రహాల దాతలు కలిదిండి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ బొర్రా శేషుబాబు, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు విగ్రహాలను ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో దాతలు పలువురు గౌడ సంఘం నాయకులు వీరమల్లు నరసింహారావు, బొర్రా చలమయ్య, జోగి సురేష్, వెంకటేశ్వరరావు, పి నాగబాబు, దావూ నాగరాజు, మండల గౌడ సంఘం అధ్యక్షులు పరసా కనకారావు, తదితరులు పాల్గొని ఆసన్న గౌడు, లచ్చన్నకు నివాళులర్పించారు. వారి ఆశయాలతో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మేలు చేయాలని కోరారు. అంతకుముందు ముదినేపల్లి నుంచి సింగరాయపాలెం, వడాలి గ్రామాల్లో గౌడ సంఘం నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు.

హైస్కూల్ స్థాయికి ప్రాథమికోన్నత పాఠశాలలు



హైస్కూలుగా అప్‌గ్రేడ్ అయిన సింగరాయపాలెం యూపీ స్కూల్

ముదినేపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వైవాక, సింగరాయపాలెం గ్రామాల్లో ప్రాథమికోన్నత పాఠశాలలు జడ్పీ ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి విజయ రామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచే అమలులోకి వస్తాయి. ఈ పాఠశాలల్లో నూతన విద్యా సంవత్సరం నుంచి 9వ తరగతిలో విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తామని ఎంఈవో కె.నరేష్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం 80 మందికిపైగా విద్యార్థులు ఉండగా, 9వ తరగతి ప్రారంభమైతే విద్యార్థుల సంఖ్య వందకు దాటుతుంది. రెండు పాఠశాలలను హైస్కూళ్లగా అప్‌గ్రేడ్ చేయాలని చేస్తున్న ప్రయత్నాలు నేటికి ఫలించడంతో ఆ గ్రామాలతోపాటు పరిసర గ్రామస్థులు కూడ హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైవాక గ్రామ విద్యార్థులు 9, 10 తరగతులకు నాలుగు కిలోమీటర్ల దూరంలోని బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి హైస్కూలుకు వెళ్లే బాధలు తప్పాయి.

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందించాలి

టీడీపీ సమావేశంలో నేతలు

ముదినేపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలితాలు అర్హులైన పేదలందరికీ అందేలా టీడీపీ కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు కోరారు. ముదినేపల్లిలో బుధవారం సాయంత్రం నిర్వహించిన మండల స్థాయి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి 60 మంది ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అన్న విషయాన్ని ఎంపిక చేసిన పార్టీ కార్యకర్తలు పరిశీలించాలని కోరారు. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే గ్రామాల్లో సంక్షేమ పథకాల అమలు సక్రమంగా జరుగుతున్నాయా లేదా అన్నది పరిశీలించాల్సిన బాధ్యతను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు బొప్పన సుందరరామయ్య, లింగమనేని భాను ప్రసాద్, పోసిన పాండురంగారావు, పర్సా విశ్వేశ్వరరావు, దావు నాగరాజు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు మందలించారని తండ్రి ఆత్మహత్య

ముదినేపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం తాగి రోజూ అర్థరాత్రి ఇంటికి వస్తున్న తండ్రిని కన్న బిడ్డలు నిలదీయడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం మండలం లోని జానకిగూడెం గ్రామానికి చెందిన పిచ్చేటి కొండయ్య(42)కు వడాలికి చెందిన గంగావేణితో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వారి కుమారుడు 9వ తరగతి, కుమార్తె ఏడో తరగతి చదువుతున్నారు. భార్య ఏడాది క్రితం సౌదీ వెళ్లింది. అప్పటి నుంచి కొండయ్య తన ఇద్దరు పిల్లలతో వడాలిలో అత్త వారింట్లో ఉంటూ ఆటో నడుపుకుంటున్నాడు. కొండయ్య మద్యానికి పూర్తిగా బానిసయ్యాడు. ప్రతీ రోజూ రాత్రి ఇంటికి బాగా తాగి వస్తుండడంతో పిల్లలు తండ్రిని మందలించారు. దీంతో మనస్తాపం చెందిన కొండయ్య మూడు రోజుల క్రితం ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి ఎస్‌ఐ వీఎస్.వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.



వేంపాడు మేజర్ కాలువలో నీటిని పరిశీలిస్తున్న చైర్మన్, తదితరులు

ముసునూరు మండలానికి సాగర్ జలాలు

ముసునూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వేంపాడు మేజర్ కాలువ ద్వారా వస్తున్న నాగార్జునసాగర్ జలాలు బుధవారం ముసునూరు మండలం సూరేపల్లి గ్రామానికి చేరాయి. సాగునీటి సంఘం చైర్మన్ రాపర్ల బాలకృష్ణ, వైస్ చైర్మన్ చలమాల వెంకటేశ్వరరావు కాలువలో నీటి ప్రవాహాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి కృషితో వేంపాడు మేజర్‌కు సాగర్ జలాలను విడుదల చేశారన్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో ఉన్న చెరువుల్లో నీరు చేరిందని, రైతులు కింద ఆయకట్టు రైతులకు నీరు చేరేలా సహకరించాలని కోరారు. ముసునూరు మండల పరిధిలోకి సాగర్ జలాలు చేరాయని, సాగునీటి సంఘాల అధ్యక్షులు, మెంబర్లు, తమ గ్రామాల్లో చెరువులోకి నీరు వచ్చేలా చూడాలని కోరారు. వేంపాడు చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో పులిచింతల ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పశువుల దాహార్తి తీర్చేందుకే నీటి తొట్టెలు



ముసునూరులో నీటి తొట్టె నిర్మాణానికి భూమిపూజ చేసిన నాయకులు

ముసునూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పశువుల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం నీటితొట్టెల నిర్మాణాలకు శ్రీకారం చుట్టిందని టీడీపీ యువనేతలు కొండేటి ఉదయ్‌కిరణ్, ఉప్పలపాటి గణేష్ అన్నారు. బుధవారం ముసునూరు, రమణక్కపేట, కాట్రేనిపాడు, గోపవరం తదితర గ్రామాల్లో నూతన నీటితొట్టెల నిర్మాణాలకు స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు భూమిపూజ చేశారు. ఏపీవో రోజ్‌లీల మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా మండలంలో 15 నీటి తొట్టెల నిర్మాణాలకు అనుమతులు వచ్చాయన్నారు. రూ.4లక్షల80 వేల నిధులతో నిర్మించే నీటితొట్టెల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు చేపట్టామన్నారు.

జనార్దనవరంలో..

చాట్రాయి : జనార్దనవరంలో ఉపాధిహామీ నిధులు రూ.33,200తో నిర్మించనున్న పశువుల నీటితొట్టెకు బుధవారం టీడీపీ నాయకులు శంకుస్థాపన చేశారు. నాయకులు మాట్లాడుతూ వేసవిలో పశువుల తాగునీటికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకు వెళ్లగా ఆయన స్పందించి అన్ని గ్రామాల్లో పశువుల తాగునీటి తొట్టెల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు. మండలంలో మొత్తం 18 గ్రామాల్లో గ్రామానికి ఒకటి చొప్పున పశువుల తాగునీటి తొట్టెలను నిర్మించటానికి ప్రభుత్వం ఉపాధిహామీ నుంచి నిధులు మంజూరు చేసినట్టు ఉపాధి హామీ ఏపీవో లక్ష్మీకుమారి చెప్పారు. టీడీపీ నాయకులు కలకొండ భాస్కరరావు, నాగమల్లి వెంకటేశ్వరరావు, బి.రత్తయ్య పాల్గొన్నారు.

రేషన్ పంపిణీపై ఫిర్యాదులు వస్తే చర్యలు

ముసునూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీపై ఎటువంటి ఫిర్యాదులు వచ్చిన శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం ముసునూరు, చెక్కపల్లి, చింతలవల్లి గ్రామాల్లో రేషన్ సరుకుల పంపిణీని ఆయన తనిఖీ చేశారు. ఈ-పోస్ మిషన్, వాహనంలో ఉన్న స్టాక్‌ను పరిశీలించి, పంపిణీ విధానంపై లబ్ధిదారుల నుంచి వివరాలను సేకరించారు. రేషన్ లబ్ధిదారుల ఈకేవైసీ ప్రక్రియను నూరుశాతం పూర్తిచేయాలని డీలర్లకు సూచించారు.

పాఠశాలల తనిఖీ

ముదినేపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): చిగురుకోట, నరసన్నపాలెం ప్రాథమిక పాఠశాలలను బుధవారం ఎంఈవో కె.నరేష్ కుమార్ తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. వేసవి తీవ్రత దృష్ట్యా గంటకోసారి వాటర్ బెల్ కొట్టడంలో అశ్రద్ధ చూపవద్దని ఎంఈవో నరేష్ కుమార్ తెలిపారు.







కైకలూరులో భవితకేంద్రం సిబ్బంది, విద్యార్థులు, ముదినేపల్లిలో ఉపాధ్యాయుల ఆటిజంపై అవగాహన ర్యాలీ, లోకుమూడిలో అవగాహన సదస్సు

చిన్నతనంలో ఆటిజం లక్షణాలు గుర్తించాలి

కైకలూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఆటిజం వైకల్యంపై అందరూ అవగాహన కలిగిఉండాలని ఎంఈవో డి.రామారావు అన్నారు. కైకలూరు భవితా కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ ఆటిజం దినోత్సవం సందర్భంగా బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ పిల్లల అభివృద్ధికి ఆటంకం కలిగించే రుగ్మత అన్నారు. లక్షణాలు, సంకేతాలను పిల్లల మొదటి మూడు సంవత్సరాల్లోనే తల్లిదండ్రులు గమనించాలన్నారు. ఆటిజం రుగ్మత ఉన్న కొంతమంది పిల్లలు సాధారణ అభివృద్ధిస్థాయి, మైలురాళ్ళు చేరుకున్న తరువాత వారి సంభాషణ, సామాజిక నైపుణ్యాలు అధ్వానంగా మారతాయన్నారు. చిన్నతనంలోనే పిల్లల తల్లిదండ్రులు గుర్తించి భవిత కేంద్రం దృష్టికి తీసుకువస్తే తగిన శిక్షణ ఇస్తారన్నారు. హెచ్‌ఎం ఎండి ఈసా, భవితా కేంద్రం సిబ్బంది జి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

● మండవల్లి: లోకుమూడి భవిత స్పెషల్ స్కూల్లో ఆటిజంపై ఐఈఆర్పీ టి.అరుణకుమారి, పి.వసంత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జన్యుపరమైన కారణాలతో ఆటిజం వస్తుందని అరుణకుమారి వివరించారు. పి నరసింహారావు ఎంపీపీఎస్ హెచ్ఎండి సుఫియాన్, సీజీవీ జి.శైలజ, పాల్గొన్నారు.

● ముదినేపల్లి: భవిత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. హైస్కూల్ హెచ్‌ఎం ఎం.గంగా కుమారి, భవిత కేంద్రం టీచర్ బి.నీలిమ, సిజివి జి.భవాని, పీఈటీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు, హైస్కూలు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఆటిజమ్ నాడీ సంబంధిత సమస్య అని, చికిత్స లేదని, బాధితులను మానసికంగా అభివృద్ధి చేయటమేనని పేర్కొన్నారు. వ్యాధి లక్షణాలను బట్టి వివిధ థెరపీల ద్వారా పిల్లల్లో మార్పు తీసుకురావచ్చునని భవిత కేంద్రం టీచర్ తెలిపారు.



నాగేంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ జయమంగళ

ఎమ్మెల్సీ నాగేంద్రబాబుకు జయమంగళ శుభాకాంక్షలు

కైకలూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన కొణిదెల నాగేంద్ర బాబుకు జయమంగళ వెంకటరమణ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం అమరావతిలో ఆయన్ను కలిశారు. జనసేన పార్టీ తరఫున నాగబాబు ప్రమాణస్వీకారం చేయడం అభినందనీయమని దీనితో జనసేన కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింపి రానున్న రోజుల్లో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళతామని జయమంగళ అన్నారు.





సింగరాయపాలెంలో శాంతి కల్యాణం, మండవల్లి కోదండ రామాలయంలో హోమం

సుబ్రహ్మణ్యేశ్వరుడి శాంతి కల్యాణం

ముదినేపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి జన్మ నక్షత్రమైన కృత్తిక నక్షత్రంలో నిర్వహించిన కల్యాణంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి పర్యవేక్షణలో అర్చకులు తేలేటి వీరభద్రశర్మ, కోట శివశంకర శర్మ కల్యాణం జరిపించారు. పలువురు భక్తులు సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

కోదండ రామాలయ వార్షికోత్సవం

మండవల్లి ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండ రామస్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు చేశారు. శ్రీరామచంద్రమూర్తికి లక్ష తులసీ దళాలతో అర్చన, అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. అనంతరం పండితులు గుడివాడ వెంకయ్య దంపతులు వాస్తు, నవగ్రహ, సుదర్శన, శ్రీరామ పరివార హోమం నిర్వహించారు. గుడివాడ చిట్టిబాబు, గుడివాడ మురళీకృష్ణ, కొల్లా కృష్ణ, బండి రంగారావు, గుడివాడ మురళి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

సాధారణ కాన్పులే తల్లీబిడ్డలకు శ్రేయస్కరం

కైకలూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సాధారణ ప్రసవాలతోనే తల్లీబిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారని కైకలూరు సీహెచ్‌సీ గైనకాలజిస్టు పి బాల ప్రసూనాదేవి అన్నారు. బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పురుటి నొప్పులు భరించలేక అనేకమంది ఆపరేషన్ల వైపు మొగ్గు చూపుతున్నారని, రెండో కాన్పులో కూడా ఆపరేషన్ చేయించుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. కుట్లు విడిపోవడం, చీము పట్టడం తదితర సమస్యలు వస్తున్నాయన్నారు. సాధారణ కాన్పు వల్ల తల్లిపాలను బిడ్డలకు వెంటనే ఇచ్చే అవకాశం ఉంటుందని, రోగనిరోధక శక్తి పెరిగి పిల్లలు ఆరోగ్యవంతంగా పెరుగుతారన్నారు. సాధారణ కాన్పు వల్ల తల్లి త్వరగా కోలుకొని ఆరోగ్యవంతంగా ఉంటుందని వీటి పట్ల అవగాహనతో గర్భిణులు సాధారణ కాన్పుకి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గర్భిణి పరిస్థితిని బట్టి డాక్టర్ల సూచన మేరకే ఆపరేషన్ చేయించుకోవాలే తప్ప సొంత నిర్ణయాలను వైద్యులపై రుద్దవద్దని తెలిపారు.



భద్రాచలం నుంచి వచ్చిన కల్యాణ తలంబ్రాలు అందుకుంటున్న ధర్మకర్త

భద్రాచలం నుంచి అపర భద్రాద్రికి కల్యాణ తలంబ్రాలు

చాట్రాయి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అపరభద్రాద్రి చనుబండ కోదండ రామాలయంలో ఈనెల ఆరోతేదీన జరిగే రాములోరి పెళ్లికి భద్రాచలం నుంచి కల్యాణ తలంబ్రాలు బుధవారం దేవస్థానానికి తీసుకువచ్చారు. సీతారామ కల్యాణానికి ఏటా భద్రాచలం నుంచి తలంబ్రాలు తీసుకురావడం ఆనవాయితీ. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి, పూజారి మారుతీ తలంబ్రాలు స్వీకరించి పూజలు చేసి మూలవిరాట్‌ల వద్ద భద్రపర్చారు. ఆలయ పునర్నిర్మాణ దాత వనమా కేశవరావు, ఉత్సవ కమిటీ సభ్యుడు మిట్టపల్లి వెంకటేశ్వరరావు పలువురు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఒకరికి ఆరు నెలల జైలు

నూజివీడు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : చెల్లని చెక్కు కేసులో ఒకరికి జైలు శిక్ష విధిస్తూ నూజివీడు ప్రత్యేక న్యాయమూర్తి వేల్పుల కృష్ణమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం సీతారంపురానికి చెందిన కన్నెగంటి సాంబశివరావు నుంచి సత్యనారాయణ 12 లక్షలు44 వేల రూపాయలు రుణంగా తీసుకున్నారు. రుణ తీర్మాన నిమిత్తం 2021 జూలైలో రూ.10 లక్షలు ఇవ్వగా బ్యాంకులో నగదు లేదని చెక్కు తిరిగి వచ్చింది. సాంబశివరావు కోర్టును ఆశ్రయించగా విచారించిన ప్రత్యేక న్యాయమూర్తి.. ముద్దాయి సత్యనారాయణకు ఆరు నెలలు జైలు శిక్ష రూ.12 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	153, 162, 173
చికెన్ విత్ స్కిన్	290
చికెన్ స్కిన్‌లెస్	300

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న అమరేంద్ర కుమార్

నూజివీడు టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : రక్తహీనతను అధిగమించడానికి పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని ఆర్‌జీకేటీ రిజిస్ట్రార్, నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్ అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి రక్తహీనత ఉన్న వారికి మందులు అందించారు. ఆయన మాట్లాడుతూ రక్తహీనత వల్ల విద్యార్థులు పలు రకాల ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని దానిని అధిగమించేందుకు పాలు, గుడ్లు, ఐరన్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. ఏవో లక్ష్మణరావు, డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ సీతాపతి, దుర్గాభవాని, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ, తదితరులు

ఉపాధి హామీ కూలీలకు వేతనాలు విడుదల చేయాలి

నూజివీడు టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు వేతనాలు తక్షణం విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం నూజివీడులో వ్యవసాయ కార్మిక సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ 15 రోజులకు ఒకసారి ఉపాధి కూలీలకు వేతనాలు ఇవ్వాలన్నారు. జనవరి నుంచి ఇప్పటి వరకు వేతనాలు ఇవ్వకపోవడం వలన పండుగ రోజుల్లోనూ కూలీలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక సంఘం నాయకులు లక్ష్మయ్య, కోటేశ్వరరావు, అనిల్, అర్జున్ పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో ఆటిజం అవగాహన దినోత్సవం

ఆగిరిపల్లి ఏప్రిల్ 02 (ఆంధ్రజ్యోతి); అంతర్జాతీయ ఆటిజం అవగాహన దినోత్సవం బుధవారం ఆగిరిపల్లిలోని ఎంపీపీఎస్ మెయిన్ పాఠశాల భవిత కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారి కె.ఆనంద్‌కుమార్ ఆధ్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటిజంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగివుండాలని, ఈ సమస్యతో బాధపడుతున్న వారి జీవితాలను శిక్షణ ద్వారా మెరుగు పరచాలని తెలిపారు. భవిత కేంద్రంలో ప్రత్యేక ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు అని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ప్రతి బుధవారం జరిగే ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలన్నారు. ఫిజియోథెరపిస్టు జి.ప్రశాంతి, స్కూల్ హెచ్‌ఎం డి.విజయదుర్గ, ప్రత్యేక ఉపాధ్యాయులు కె.ఝాన్సీరాణి, బి.రజిని దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సహాయకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నూజివీడు ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ సహాయకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు సీడీపీవో కె.ధనలక్ష్మి తెలిపారు. నూజివీడు పట్టణ పరిధిలోని రజక పేట. కోనేరుపేట, ఆగిరిపల్లి మండల పరిధిలోని బూరుగూడెం, ముసునూరు మండల పరిధిలోని ముసునూరులో గల అంగన్‌వాడీ కేంద్రాలలో సహాయకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై 35 ఏళ్ల లోపు వారు దరఖాస్తులను అందజేయాలన్నారు. రిజర్వేషన్, ఇతర వివరాలకు సీడీపీవో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు

అంగన్వాడీల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కైకలూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కైకలూరు నియోజకవర్గంలో ఒక అంగన్వాడీ కార్యకర్త, 7 సహాయకురాలు పోస్టులకు ఈ నెల 17 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీవో వి దీప్తి తెలిపారు. కైకలూరు మండలం గుమ్మళ్ళపాడు-2 అంగన్వాడీ కార్యకర్త (ఎస్సీ)కు దరఖాస్తుకు ఆహ్వానిస్తున్నమన్నారు. సహాయకురాలు పోస్టులకు ముదినేపల్లి మండలం అల్లూరు-1, ముదినేపల్లి-6 ఓసీ అభ్యర్థులుకు, మండవల్లి మండలం తక్కెళ్లపాడు-1, మండవల్లి-2 ఎస్సీ అభ్యర్థులు, కలిదిండి మండలం చింతలమోరు ఎస్సీ అభ్యర్థి కైకలూరు మండలం జంగంపాడు బీసీఏ, కైకలూరు 9వ వార్డు ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 17న ఐసీడీసీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

కార్పొరేషన్ రుణ లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూ

కైకలూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బీసీ, ఈబీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలకు 1831మంది హాజరైనట్లు ఎండీవో ఆర్ ఫణీంద్ర తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలో 2395మంది దరఖాస్తు చేసుకోగా 1831మంది హాజరయ్యారన్నారు. బ్యాంకర్లతో కలిసి రుణ లబ్ధిదారుల ఎంపిక జరగనున్నట్లు తెలిపారు.

పాఠశాలల్లో వాటర్ బెల్

కలిదిండి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా పాఠశాలలో వాటర్ బెల్ సక్రమంగా అమలు చేయాలని ఎంఈవో శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పెదపుట్లపూడి, అప్పారావుపేట పాఠశాలను పరిశీలించారు. ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని ఉదయం 10, 11, 12 గంటలకు వాటర్ బెల్ ఇవ్వాలన్నారు. విద్యార్థులు వాటర్ తాగేవిధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు.

పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి శంకుస్థాపన

కలిదిండి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెంకటాపురంలో ఉపాధి హామీ పథకం నిధులతో పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, సర్పంచ్ గూడవల్లి శ్రీనివాసరావు బుధవారం శంకుస్థాపన చేశారు. వేసవిలో పశువుల దాహార్తిని తీర్చడానికి నీటి తొట్టెలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఎంపీడీవో ఆనంద్, ఫీల్డ్ అసిస్టెంట్ నాగబాబు, వీఆర్వో కమల్‌హసన్, తదితరులు పాల్గొన్నారు.



మంకొల్లులో అవగాహన ర్యాలీ

భూముల రీసర్వేపై అవగాహన ర్యాలీ

చాట్రాయి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మంకొల్లు గ్రామంలో భూముల రీసర్వేపై తహసీల్దార్ గీత ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక పాఠశాల వద్ద గ్రామసభ నిర్వహించి భూముల రీసర్వే విధి విధానాలను రైతులకు వివరించారు. ఆమె మాట్లాడుతూ 65 ఏళ్ల తరువాత ప్రభుత్వం భూముల రీసర్వే చేపట్టిందని ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి రైతులు ప్రజలు సహకరించాలన్నారు. సర్వేయర్లు ప్రేమ్‌కుమార్, లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది గ్రామస్థులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎంప్లాయీస్ నూతన కార్యవర్గం ఎన్నిక

నూజివీడు టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యవర్గ ఎన్నికను బుధవారం నిర్వహించారు. ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మహాలక్ష్మి నేతృత్వంలో ఎన్నిక నిర్వహించగా కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడిగా వి.గోవిందరావు, అసోసియేట్ అధ్యక్షులుగా ఈమని శేషయ్య, ఈఎన్ఎస్‌వీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఎన్‌కేవీఎల్ఎన్ సోమయాజులు, కోశాధికారిగా ప్రసాదరావు, కార్యదర్శులుగా రాంబాబు, కోటేశ్వరి, తిరుపతిరావు తదితరులు ఎన్నికయ్యారు.

నలుగురు బైండోవర్

ముసునూరు, ఏప్రియల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ నేరాలకు పాల్పడుతున్న నలుగురిని బుధవారం ముసునూరు తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ ఎదుట ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య ఆధ్వర్యంలో బైండోవర్ చేశారు. చెక్కపల్లి గ్రామానికి చెందిన ఎన్.ఆంజనేయులు, గుర్రం వెంకటేశ్వరరావు, తాళం మోహనరావు, పిల్లి సతీష్‌బాబులను ఏడాది కాలపరిమితిలో మళ్లీ ఎక్సైజ్ నేరాలకు పాల్పడితే లక్ష రూపాయలు జరిమానా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు రద్దు పూచికత్తుపై తహసీల్దార్ బైండోవర్ చేసి హెచ్చరించారు. గ్రామాల్లో సారా తయారు చేసిన, అమ్మినా, రవాణా చేసిన, 94409 02462 నంబరుకు సమాచారం ఇవ్వాలని సీఐ తెలిపారు.